



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 360 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 2 సెప్టెంబర్ 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE :360 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 2 SEPTEMBER 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur





## దమ్ముంటే అసెంబ్లీకి రండి...

# తేల్చుకుందాం

### వైసీపీకి చంద్రబాబు ఓపెన్ ఛాలెంజ్

- రాజంపేట పర్యటనలో సీఎం చంద్రబాబు పెన్షన్ల పంపిణీ
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని వైసీపీకి సవాల్
- బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామాలపై చర్చకు తాను సిద్ధమన్న సీఎం
- అప్పులతో సంక్షేమం చేస్తే చిప్పే మిగులుతుందని పాత ప్రభుత్వంపై విమర్శ
- రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపిస్తానని హామీ
- గత సర్కారులో అనర్హులకు పింఛన్లు ఇచ్చారని ఆరోపణ



దమ్ముంటే అసెంబ్లీకి రండి.. ఎవరిది విధ్వంసమో, ఎవరిది అభివృద్ధో తేల్చుకుందాం" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీకి బహిరంగ సవాల్ విసిరారు. రాజంపేట నియోజకవర్గంలోని బోయనపల్లిలో సోమవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగిస్తూ, గత ఐదేళ్ల పాలనపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, వైసీపీ నేతలు సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఈ సవాల్ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అసెంబ్లీకి రండి.. తేల్చుకుందాం**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అంశంపైనా చర్చకు సిద్ధమని చంద్రబాబు స్పష్టం చేశారు. "బాబాయ్ హత్యపై చర్చిద్దాం రండి. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల గురించి మాట్లాడుకుందాం. దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటనపై సమాధానం చెప్పాలి. కోడికత్తి డ్రామా, గులక రాయి డ్రామాలపై కూడా చర్చకు నేను సిద్ధం. వైసీపీ అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు నేను సిద్ధంగా ఉన్నాను, మరి చర్చించడానికి వైసీపీ సిద్ధమా?" అంటూ చంద్రబాబు తీవ్ర స్వరంతో నిలదీశారు. తనపై క్లైమోర్ మైన్లతో దాడి చేసినా చలించలేదని, తాను డ్రామాలు ఆడే వ్యక్తిని కాదని ఆయన అన్నారు.

ఎన్నికల ముందు 'సిద్ధం సిద్ధం' అని నినాదాలు చేసిన వారికి నేను సూటిగా సవాల్ విసురుతున్నాను.

వివరాలు 2లో..

# సీఎంగా 30 ఏళ్లు..

### చంద్రబాబుపై తనయుడు లోకేశ్ ప్రశంసల వర్షం



- ముఖ్యమంత్రిగా చంద్రబాబు 30 ఏళ్ల ప్రస్థానంపై తనయుడు లోకేశ్ పోస్ట్
- ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షలకు నాన్న కొత్త రూపం ఇచ్చారని ప్రశంస
- టెక్నాలజీ, సంక్షేమాన్ని జోడించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని కొనియాడిన లోకేశ్
- హంద్రీనీవాతో రాయలసీమ రూపురేఖలు మార్చారని కితాబు
- ఇంట్లో నాన్నగా, ఆఫీసులో బాస్‌గా ఆయన్ని పిలవడం నా అదృష్టమని వ్యాఖ్యం

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు తొలిసారి ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళు పూర్తయిన సందర్భంగా, ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తన తండ్రిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టిన ఆయన, చంద్రబాబు నాయకత్వ పటిమను, దార్శనికతను కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షలకు కొత్త రూపాన్నిచ్చి, వాటిని వాస్తవ రూపంలోకి తీసుకురావడమే కాకుండా, పటిష్ఠమైన వ్యవస్థలను నిర్మించిన శకం ఇదని లోకేశ్ అభివర్ణించారు. పరిపాలనలో టెక్నాలజీని జోడించడం, పెట్టుబడులను ఆకర్షించి ఉద్యోగాలు కల్పించడం ద్వారా చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేశారని లోకేశ్ పేర్కొన్నారు. హైటెక్ సిటీ, జినోమ్ వ్యాలీ వంటి వాటితో రాష్ట్రాన్ని సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టారని, భవిష్యత్ నగరాలకు ప్రతీకగా అమరావతిని నిర్మించాలనే సంకల్పాన్ని

వివరాలు 2లో..

### చంద్రబాబు, పవన్, కేసీఆర్, జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నా...

# తెలుగువాడికి అవకాశం వచ్చింది



- ఉప రాష్ట్రపతి బరిలో నిలిచిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి
- రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలు పక్కన పెట్టాలన్న రేవంత్ రెడ్డి
- ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వాలన్న ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**ఉపరాష్ట్రపతిగా తెలుగు వ్యక్తిని గెలిపించుకునే అవకాశం వచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

వివరాలు 2లో..

# దివ్యాంగుల పెన్షన్ ను రూ.15 వేలు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే

- రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ
- తెనాలిలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదు అందజేసిన మంత్రి నాదెండ్ల
- మొత్తం 63.61 లక్షల మందికి రూ. 2746 కోట్లు విడుదల
- పారదర్శకత కోసమే ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తున్నామన్న మంత్రి


వివరాలు 2లో..



# ప్రజలను మోసం చేసేవాళ్లే గొప్ప లీడర్లు

- రాజకీయాలపై మరోసారి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు
- తాను పనిచేసే రంగంలో నిజం మాట్లాడటం నిషిద్ధమని వ్యాఖ్య
- షార్ట్‌కట్‌లు జీవితాన్ని షార్ట్‌గా కట్ చేస్తాయని ప్రజలకు హితవు

వివరాలు 2లో..



## ఆగస్టులోనూ జీఎస్టీ వసూళ్ల జోరు.. ఖజానాకు రూ. 1.86 లక్షల కోట్లు!

- గత ఏడాదితో పోలిస్తే 6.5 శాతం వృద్ధి నమోదు
- వరుసగా ఎనిమిదో నెల రూ. 1.8 లక్షల కోట్ల మార్కును దాటిన కలెక్షన్లు
- పన్నుల శ్లాబుల మార్పుపై త్వరలో భేటీ కానున్న జీఎస్టీ మండలి
- భారత జీడీపీ వృద్ధి అంచనాలను 6.7 శాతానికి పెంచిన మోర్గాన్ స్టాన్లీ




**పెన్ పవర్ డెస్క్:**దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందనడానికి సంకేతంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. 2025 ఆగస్టు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 1.86 లక్షల కోట్లు సమకూరినట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం

వివరాలు 2లో..

# యుద్ధం ముగియాలి.. శాంతి నెలకొనాలి



- ఎస్‌సీఓ సదస్సులో పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ
- యుక్రెయిన్ యుద్ధానికి త్వరగా ముగింపు పలకాలని స్పష్టీకరణ
- శాంతి స్థాపన యావత్ మానవాళి ఆకాంక్ష అని వ్యాఖ్య
- భారత్ ప్రయత్నాలను అభినందించిన రష్యా అధ్యక్షుడు పుతిన్
- భేటీకి ముందు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

**పెన్ పవర్ డెస్క్:**ఉక్రెయిన్ సంక్షోభంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తన వైఖరిని మరోసారి ప్రపంచ వేదికపై స్పష్టం చేశారు. యుద్ధానికి త్వరగా ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అన్నారు. చైనాలోని తియాంజిన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా సోమవారం ఇరువురు నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, "యుక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి ఇటీవల జరుగుతున్న ప్రయత్నాలను మేం స్వాగతిస్తున్నాం. ఇందులో భాగస్వాములైన అన్ని పక్షాలు నిర్మాణాత్మకంగా ముందుకు సాగుతాయని ఆశిస్తున్నాం. ఈ ఘర్షణను వీలైనంత త్వరగా ముగించి, ప్రాంతీయంగా శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే మార్గాలను

వివరాలు 2లో..

# అన్నమయ్య... ఇక అంతేనయ్య!

- గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి సర్కారుపై షర్మిల ఫైర్
- అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఐదేళ్లయినా పట్టించుకోలేదని విమర్శలు
- జగన్ రూ.800 కోట్లతో, చంద్రబాబు రూ.340 కోట్లతో హామీలిచ్చి మోసం చేశారని ఆరోపణ



**పెన్ పవర్ డెస్క్:** అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం విషయంలో గత వైసీపీ ప్రభు త్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెండూ ఘోరంగా విఫలమయ్యాయని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించా రు. ప్రాజెక్టు కొట్టుకుపోయి ఐదేళ్లు గడిచినా, 39 మందిని బలిగొన్న ఆ ఘోర విపత్తు బాధితుల జీవితాలు

వివరాలు 2లో..

# భవిష్యత్తును ఊహించి ముందుకెళ్లే దార్శనికుడు సీఎం చంద్రబాబు

- 30 ఏళ్ల కిందట తొలిసారిగా సీఎం బాధ్యతలు అందుకున్న చంద్రబాబు
- శుభాకాంక్షలు తెలియజేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం అని కితాబు




**పెన్ పవర్ డెస్క్:**చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లయింది. ఈ నేప థ్యంలో ఆయ నకు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజే స్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా

వివరాలు 2లో..

# ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

- వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- తెలంగాణ, ఏపీలలోని పలు జిల్లాల్లో వర్షాలు
- వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# జగన్ వాటిని నమ్ముకుంటే నిండా మునిగిపోక తప్పదట

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి అధికారంలోకి వస్తామని భావిస్తున్నారు. ఆయనకు జిల్లాల పర్యటనలో వచ్చి స్పందన చూసి మరోసారి అధికారం తనదేనని భావిస్తున్నారు. ఈసారి సర్వేలను నమ్ముకున్నట్లు కనిపించడం లేదు. సర్వేలు, ఐప్యాక్ వంటి సంస్థల వంటి వాటిని నమ్ముకుని నట్టేట మునిగామని జగన్ బలంగా విశ్వసిస్తున్నారు. అందుకే సొంతంగా తానే జగన్ నియోజకవర్గాల నేతలను ఎంపిక చేసే విషయంపై దృష్టిపెట్టారు. అయితే జగన్ పై కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఇప్పటికీ పార్టీలో విమర్శలు వినిపిస్తున్నాయి. జగన్ ఓటమి తర్వాత కూడా కోటరీ నుంచి బయట పడలేకపోతున్నారని కొందరు నేతలు బాహాటంగానే చెబుతున్నారు. కోటరీని వదిలి వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా నియోజకవర్గాలకు నాయకత్వాలను ఎంపిక చేయాలని కోరుతున్నారు.

**క్యాడర్ అభిప్రాయం మాత్రం..**

ముందుగా కార్యకర్తల అభిప్రాయాన్ని తెలుసుకోవాలని కూడా అనేక మంది నేతలు కోరుతున్నారు. నేతలు చాలా మంది ఓటమి తర్వాత ఏడాది నుంచి నియోజకవర్గాల్లో ఉండటం లేదు. కార్యకర్తలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన నాయకులపై కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ తమను పట్టించుకోని నేతలు, ఓటమి తర్వాత కూడా తమకు అందుబాటులో ఉండటం లేదని క్యాడర్ అనేక నియోజకవర్గాల్లో అసంతృప్తిగా ఉంది. అయితే కూటమి పార్టీలను వ్యతిరేకిస్తూ, జగన్ పై అభిమానంతోనే ఇంకా జెండా పట్టుకుని ఉన్నామని, స్థానిక నేతలను చూసి కాదని సోషల్ మీడియాలో వారు పోస్టులు పెడుతున్నారు.

**కోటరీ సలహాలు వింటే?**

వైఎస్ జగన్ కూడా నేతలను దగ్గరకు తీసుకుంటే కార్యకర్తలు దూరమయ్యే అవకాశాలున్నాయి. ఎందుకంటే స్థానిక నాయకత్వంపై క్యాడర్ కు నమ్మకం లేకపోగా బాగా అసంతృప్తి ఉంది. కోటరీ మాత్రం గత ఎన్నికల్లో పోటీ చేసిన వారినే ఇన్ ఛార్జులుగా నియమించాలని, వారికే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వాలని వత్తిడి తెస్తే మళ్లీ మోసం వస్తుందన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం జగన్ చేయాల్సింది కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేయడం. వారిని సముదాయించడం. తిరిగి వారిని ఉత్తేజపర్చడం. ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియా ఒకింత యాక్టివ్ అయింది. అయితే క్యాడర్ మరింతగా పార్టీ కోసం పనిచేయాలంటే జగన్ నేతలతో కాదు.. క్యాడర్ తో మమేకం కావాలని అంటున్నారు. మరి జగన్ ఈ దిశగా ఆలోచన చేస్తారా? లేదా? అన్నది చూడాలి.

# అన్నమయ్య... ఇక అంతేనయ్య!

- మొదటి పేజీ తరువాయి

ఇంకా కన్నీళ్లలోనే మగ్గుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రెండు ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు 'అనాథ ప్రాజెక్టు'గా మారిపోయిందని ఆమె అన్నారు. "అన్నమయ్య..ఇక అంతేనయ్య. ప్రాజెక్ట్ కొట్టుకు పోయి 5 ఏళ్లు దాటినా పునర్ నిర్మాణానికి దిక్కులేదు. 39 మందిని బలిగొన్న ఘోర విపత్తులో జరిగిన నష్టాన్ని పూడ్చే మనసు ప్రభుత్వాలకు లేదు. 5 ఊళ్లు కొట్టుకుపోతే పునరావాసానికి రూపాయి ఇచ్చింది లేదు. సర్వం కోల్పోయిన నిరాశ్రయులను నేటికి ఆదుకున్నది లేదు. గత ముఖ్యమంత్రి జగన్ గారు రూ.800 కోట్లతో మరమ్మతులు అంటూ హడావిడి చేయడం తప్ప ప్రాజెక్ట్ ను కట్టింది లేదు. పునరుద్ధరణ పేరుతో 3 ఏళ్లు గడిపారే తప్ప... తట్టెడు మట్టి వేయలేదు. బాధిత కుటుంబాలకు ఇళ్లు అందలేదు. చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగాలు దక్కలేదు. ఇసుక మాఫియాతో ప్రాజెక్టుకు గండి పడితే అసెంబ్లీ వేదికగా హై లెవెల్ కమిటీలనీ, దర్యాప్తు కొనసాగిస్తామని కాలయాపన తప్ప జగన్ గారు ఉద్ధరించింది శూన్యం. అధికారంలో వచ్చిన ఏడాదిలో ప్రాజెక్ట్ కడతామని చెప్పి చంద్రబాబు గారు చేస్తుంది కూడా మోసమే. రాజంపేటకు రెండుసార్లు వచ్చిపోయారు కానీ, ప్రాజెక్ట్ పనులకు మోక్షం లేదు. రూ.340 కోట్లతో మరమ్మతులు అని చెప్పి రూపాయి కూడా ఇవ్వలేదు. డ్యామ్ నిర్మాణం కోసం సర్వేల పేరుతో బాబు గారు సైతం కాలయాపన చేస్తున్నారు. రాజంపేట వేదికగా మళ్లీ మాయమాటలు చెప్పారు తప్పిస్తే ప్రాజెక్ట్ నిర్మాణంపై దిశా - నిర్దేశం లేకపోవడం శోచనీయం. కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమిప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అన్నమయ్య కన్నీటి వ్యథకు శాశ్వత పరిష్కారం చూపాలి. గత 5 ఏళ్లుగా నీటి నిల్వ లేక 30 వేల ఎకరాలకు సాగునీరు పారడం లేదు. లక్షమందికి త్రాగునీరు అందడం లేదు. వెంటనే పూర్తి స్థాయి నిధులు కేటాయించి అన్నమయ్య ప్రాజెక్ట్ ను పూర్తి చేయాలని, డ్యామ్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు హామీల మేరకు పూర్తి స్థాయి జరగాలని డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

# ఆగస్టులోనూ జీఎస్టీ వసూళ్ల జోరు.. ఖజానాకు రూ. 1.86 లక్షల కోట్లు!

- మొదటి పేజీ తరువాయి

విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 6.5 శాతం అధికం. వరుసగా ఎనిమిదో నెల జీఎస్టీ వసూళ్లు రూ. 1.8 లక్షల కోట్ల మార్కును దాటడం దేశంలో పెరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలకు అద్దం పడుతోంది.

ఆగస్టు నెలలో దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 9.6 శాతం పెరిగి రూ. 1.37 లక్షల కోట్లకు చేరింది. అయితే, దిగుమతులపై పన్ను 1.2 శాతం తగ్గి రూ. 49,354 కోట్లుగా నమోదైంది. రీఫండ్స్ మినహాయించిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ. 1.67 లక్షల కోట్లుగా ఉందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 10.7 శాతం వృద్ధిని సూచిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో జీఎస్టీ మండలి త్వరలో సమావేశం కానుంది. ఈ సమావేశంలో పన్నుల హేతుబద్ధీకరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. చాలా వస్తువులపై 5 శాతం, 18 శాతం చొప్పున రెండు శ్లాబులను ప్రవేశపెట్టడం, సిగరెట్లు, పొగాకు, చక్కెర పానీయాల వంటి 'సిన్ గూడ్స్'పై 40 శాతం ప్రత్యేక పన్ను విధించడం వంటి ప్రతిపాదనలపై చర్చించనున్నారు. ఇదే సమయంలో, ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ భారత ఆర్థిక వ్యవస్థపై తన అంచనాలను మరింత మెరుగుపరిచింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడంతో, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను భారత వృద్ధి రేటు అంచనాను గతంలోని 6.2 శాతం నుంచి 6.7 శాతానికి పెంచుతున్నట్లు తన నివేదికలో పేర్కొంది. రాబోయే పండుగల సీజన్, జీఎస్టీ పన్నుల్లో కోతల అంచనాలు దేశీయ డిమాండ్‌కు ఊతమిస్తాయని, ఇది ఎగుమతుల్లో తగ్గుదలను భర్తీ చేస్తుందని మోర్గాన్ స్టాన్లీ అభిప్రాయపడింది. జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల వృద్ధి రేటుకు సుమారు 50 బేసిస్ పాయింట్ల (0.5%) మేర ప్రయోజనం చేకూరవచ్చని అంచనా వేసింది.

# దమ్ముంటే అసెంబ్లీకి రండి... తేల్చుకుందాం

**ంపెన్షన్ల పంపిణీలో అక్రమాలపై విమర్శలు**

అంతకుముందు, ముఖ్యమంత్రి నేరుగా బోయనపల్లి గ్రామంలోని యడవల్లి సుమిత్రమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెన్షన్ అనేది పేదలకు ఇచ్చే దానం కాదని, అది ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. "తెలుగు వారికి పెన్షన్లను పరిచయం చేసింది ఎన్టీఆర్. ఆయన రూ. 30తో ప్రారంభిస్తే, మేం ఇప్పుడు రూ. 4000 ఇస్తున్నాం. దివ్యాంగులకు 12 రెట్లు పెంచింది టీడీపీ ప్రభుత్వమే" అని గుర్తుచేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం అవయవాలన్నీ సక్రమంగా ఉన్న తమ పార్టీ కార్యకర్తలకు కూడా దివ్యాంగుల పెన్షన్ ఇచ్చిందని, ఇలాంటి అనర్హులను ప్రజలే నిలదీయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పేదలకే ప్రభుత్వ సంపద అందాలని ఆయన అభిప్రాయపడ్డారు.

సంపద సృష్టితోనే సంక్షేమం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ, "అప్పు చేసి పప్పు కూడు తింటే చివరికి చిప్పే మిగులుతుంది. అప్పులు చేసి బాగుపడ్డ వారు ఎవరూ లేరు" అంటూ గత ప్రభుత్వ ఆర్థిక విధానాలను చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఆదాయాన్ని పెంచి, ఆ సంపదను పేదలకు సంక్షేమం రూపంలో అందించడమే తన విధానమని పునరుద్ఘాటించారు. "నేను ఐటీ, హైటెక్ సిటీ అంటే ఎగతాళి చేశారు. కానీ ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు ఉన్నతస్థాయిలో ఉన్నారంటే అందుకు ఐటీనే కారణం. డ్వాక్రా సంఘాలు పెట్టి మహిళలను ఆర్థికంగా నిలబెట్టాం. మేం చేసిన మంచిని ప్రజలు గుర్తుంచుకోవాలి" అని ఆయన కోరారు.

**రాయలసీమకు రత్నాల హారం**

రాయలసీమ అభివృద్ధికి తన ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. "రాయలసీమను రతనాల సీమగా మార్చడమే నా లక్ష్యం. సీమకు నీళ్లిచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది. ఆయన స్ఫూర్తితో రాయలసీమలో కరవును శాశ్వతంగా దూరం చేస్తాం. నిన్ననే కుప్పానికి నీళ్లు తీసుకెళ్లాను, భవిష్యత్తులో రాజంపేట, కోడూరుకు కూడా సాగునీరు అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. కరవు జిల్లా అయిన అనంతపురానికి కియా పరిశ్రమను తీసుకొచ్చి ఆ ప్రాంత రూపురేఖలు మార్చామని, అదే తరహాలో రాయలసీమకు పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తామని తెలిపారు. ఆడబిడ్డల జోలికి వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తన బలం, బలగం ప్రజలేనని, వారి సహకారంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని చంద్రబాబు పేర్కొన్నారు.

# ప్రజలను మోసం చేసేవాళ్లే గొప్ప లీడర్లు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి రాజకీయాలపై తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలను మోసం చేసేవారినే గొప్ప నాయకులుగా పరిగణిస్తారని, తాను పనిచేసే రంగంలో మనస్ఫూర్తిగా నిజం మాట్లాడటం నిషిద్ధమని అన్నారు. నిర్మొహమాటంగా మాట్లాడతారనే పేరున్న గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. వివరాల్లోకి వెళితే, నాగ్‌పూర్‌లో 'అఖిల భారత మహానుభావ పరిషత్తు' నిర్వహించిన ఒక కార్యక్రమంలో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో విజయం సాధించడానికి అడ్డదారులను ఎంచుకోవద్దని ప్రజలకు సూచించారు. "ఏదైనా సాధించడానికి ఒక షార్ట్ కట్ ఉంటుంది. కానీ, మీరు షార్ట్ కట్ వాడితే, అది మిమ్మల్ని షార్ట్‌గా కట్ చేస్తుంది. అందుకే నిజాయతీ, విశ్వసనీయత వంటి విలువలను పాటించాలి" అని ఆయన హితవు పలికారు.

సమాజంలో నిజం, అంకితభావం వంటి విలువలు దీర్ఘకాలిక విజయాన్ని అందిస్తాయని గడ్కరీ పేర్కొన్నారు. అంతిమంగా నిజమే గెలుస్తుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన మాటలను ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ఆయన రాజకీయాలపై తన మార్క్ సెటైర్లు వేశారు. గడ్కరీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ప్రభుత్వ నిర్ణయాలపై కోర్టులను ఆశ్రయించడం వల్లే పరిపాలనలో క్రమశిక్షణ పెరుగుతోందని అన్నారు. మంత్రులు చేయలేని పనులను న్యాయస్థానాలు చేయిస్తాయని అభిప్రాయపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మంచి పనులు చేసే నేతలకు గౌరవం, చెడు పనులు చేసేవారికి శిక్షలు ఉండవని గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అయిన విషయం తెలిసిందే.

# సీఎంగా 30 ఏళ్లు..

- మొదటి పేజీ తరువాయి

చాటారని గుర్తుచేశారు. జవాబుదారీతనంతో కూడిన వేగవంతమైన పాలన అందిస్తూ, పౌరులకు, సంస్థలకు సాధికారత కల్పించే వేదికలను నిర్మించారని వివరించారు. పేదరిక నిర్మూలన పథకాలు, రిజర్వేషన్ల అమలుతో సామాజిక న్యాయం అందించడంలో చంద్రబాబు ఎంతో కృషి చేశారని లోకేశ్ ప్రశంసించారు. రాయలసీమ సాగునీటి సమస్యపై చంద్రబాబు చూపిన చొరవను లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తరలించి కరవుపీడిత రాయలసీమను సస్యశ్యామలం చేశారని అన్నారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి, గ్రామాల్లో చెరువులను నింపి రైతుల ఆదాయాన్ని స్థిరపరిచారని తెలిపారు. పోలవరం, బనకచర్ల వంటి ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ రతనాలసీమగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇంట్లో 'నాన్న' అని, ఆఫీసులో 'బాస్' అని పిలవడం నా అదృష్టం. ఆయన అనుభవం కలిగిన యువకుడు. స్పష్టత, ధైర్యం, నమ్మకంతో కొత్త సవాళ్లను స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు" అని లోకేశ్ తన పోస్టులో ఉద్వేగంగా పేర్కొన్నారు.

# ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే రెండు రోజుల పాటు భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, హన్మకొండ, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలో రానున్న 12 గంటల నుంచి 36 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# దివ్యాంగుల పెన్షన్ ను రూ.15 వేలు పెంచిన ఘనత మా ప్రభుత్వానిదే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పేరిట పెన్షన్ల పంపిణీ చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇవాళ (సెప్టెంబరు 1) రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. సెప్టెంబర్ నెల కోటా కింద రాష్ట్రవ్యాప్తంగా 63,61,380 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ. 2,746.52 కోట్లను విడుదల చేసింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంత్రి నాదెండ్ల మనోహర్, గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని జాగర్లమూడి గ్రామంలోని సుల్తానాబాద్ కాలనీల్లో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత తీసుకువచ్చేందుకే లబ్ధిదారుల ఇంటి వద్దకే నేరుగా పెన్షన్ మొత్తాన్ని అందిస్తున్నామని తెలిపారు. కేవలం తెనాలి నియోజకవర్గంలోనే 35,563 మందికి రూ. 14.99 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సాధారణ పెన్షన్‌ను రూ. 2,000 నుంచి రూ. 4,000కు, దివ్యాంగుల పెన్షన్‌ను అర్హతను బట్టి రూ. 6 వేలు, రూ. 10 వేలు, రూ. 15 వేలకు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు వంటి నిస్సహాయ వర్గాలను ఆదుకోవడమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే సామాజిక భద్రతా పెన్షన్లకు అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వితంతువులకు కూడా త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

**స్థానిక అభివృద్ధికి హామీ**

ఈ పర్యటనలో భాగంగా మంత్రి నాదెండ్ల మనోహర్ పలు స్థానిక అభివృద్ధి పనులపై హామీ ఇచ్చారు. జాగర్లమూడిలో సదరం క్యాంపు ఏర్పాటు చేస్తామని, పాఠశాల భవనం, పంచాయతీ కార్యాలయం, రహదారుల నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఈ నెలలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తామని, సైడ్ కాలువల ఆధునీకరణ, రక్షిత మంచినీటి సరఫరా వంటి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అదేవిధంగా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ, త్వరలో స్మార్ట్ రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ ప్రాంతంలో నిమ్మ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## చంద్రబాబు, పవన్, కేసీఆర్, జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నా...

# తెలుగువాడికి అవకాశం వచ్చింది

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు మద్దతు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నాను. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కన పెట్టి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి" అని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని తెలిపారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఉందని అన్నారు.

రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే అజెండాతో ఎన్డీయే అభ్యర్థిని నిలబెట్టిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపిందని చెప్పారు. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చని, కానీ తెలుగు వ్యక్తికి అవకాశం వచ్చిందని వ్యాఖ్యానించారు.

# యుద్ధం ముగియాలి.. శాంతి నెలకొనాలి

- మొదటి పేజీ తరువాయి

మనం కనుగొనాలి. ఇది యావత్ మానవాళి పిలుపు" అని స్పష్టం చేశారు. మోదీ వ్యాఖ్యలకు పుతిన్ కూడా సానుకూలంగా స్పందించారు. ఎస్‌సీఓ సదస్సులో తన ప్రసంగం సందర్భంగా, ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారంలో భారత్, చైనా వంటి వ్యూహాత్మక భాగస్వాములు అందిస్తున్న సహకారాన్ని తాము ఎంతగానో గౌరవిస్తున్నామని పుతిన్ పేర్కొన్నారు. గత నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కుదిరిన అవగాహనలు ఉక్రెయిన్‌లో శాంతికి మార్గం సుగమం చేశాయని ఆయన ప్రస్తావించారు.

ఈ భేటీ తర్వాత ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, పుతిన్‌తో సమావేశం అద్భుతంగా జరిగిందని తెలిపారు. వాణిజ్యం, ఎరువులు, అంతరిక్షం, భద్రత, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించామని వెల్లడించారు. "ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారంతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై మేం అభిప్రాయాలు పంచుకున్నాం. మన ప్రత్యేక, విశేషాధికార వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి కీలక స్తంభంగా నిలుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, ఎస్‌సీఓ సదస్సు కోసం చైనాకు వచ్చిన వెంటనే శనివారం ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఫోన్ చేయడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, యూరప్ నేతలతో వాషింగ్టన్‌లో జరిగిన చర్చల వివరాలను జెలెన్‌స్కీ ప్రధానికి వివరించారు. ఈ సంక్షోభ పరిష్కారానికి అవసరమైన ప్రయత్నాలు చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఎస్‌సీఓ సదస్సు వేదికగా రష్యాకు సరైన సంకేతాలు పంపుతామని మోదీ ఆయనకు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# భవిష్యత్తును ఊహించి ముందుకెళ్లే దార్శనికుడు సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

సీఎం చంద్రబాబును ఉద్దేశించి ప్రత్యేక సందేశం విడుదల చేశారు. చంద్రబాబు దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి అని, తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం అని కొనియాడారు.

"భవిష్యత్తును ఊహించి ప్రణాళికబద్ధంగా దూరదృష్టితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దార్శనికుడు చంద్రబాబు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పాలనా దక్షతతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు, సంస్కరణలు అభివృద్ధిని పరుగులు పెట్టించాయి. పాలనలో ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా సవాళ్లుగా స్వీకరించి ముందడుగు వేశారు.

హైదరాబాద్ మాదాపూర్ ప్రాంతంలో కొండలు, గుట్టలుగా ఉన్న ప్రాంతాన్ని ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్ గా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. 90వ దశకంలో ఆయన ఐటీ రంగానికి పెద్దపీట వేయడం వల్లే తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల నుంచి ఐటీ ఉద్యోగులు వచ్చారు. రైతు బజార్ల ఏర్పాటు, డ్వాక్రా సంఘాల స్థాపన, పేదల కోసం వెలుగు ప్రాజెక్టు ప్రారంభం, మీసేవా కేంద్రాల ఏర్పాటు వంటి నూతన ఆవిష్కరణలు చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనం. రాష్ట్ర విభజన అనంతరం క్లిష్ట సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు. ప్రజా రాజధానిగా అమరావతి, రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు, వీటితోపాటు పారిశ్రామికవృద్ధి లక్ష్యంగా 2014లో పాలన మొదలుపెట్టారు. 2024లోనూ మరింత క్లిష్ట పరిస్థితుల్లో పాలనా పగ్గాలు చేపట్టారు. కఠిన సవాళ్లు ముందున్నా దృఢచిత్తంతో పాలన వ్యవస్థను ముందుకు తీసుకెళుతున్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టులకు నిధులు సాధించడం చంద్రబాబు నాయకత్వ లక్షణాలను తెలియజేస్తుంది. పాలనా వ్యవహారాల్లో టెక్నాలజీ వినియోగిస్తూ, ప్రజలకు సత్వర సేవలు అందేలా చేస్తున్నారు. దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి నిర్దేశకత్వంలో మా మంత్రివర్గం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తోంది" అని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.



చిన్న టేకూరులో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఐఐటి-మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో నీట్ -2025లో ఎంబిబిఎస్‌లో సీట్లు సాధించిన అభ్యర్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా





# సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పయ్యావుల

**అనంతపురం పెన్ పవర్ సెప్టెంబర్01 :** రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అనంతపురం శివారులో ఉన్న జిఎంఆర్ గ్రౌండ్‌లో స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ.భరత్, రాష్ట్ర ఆర్థిక& ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్,రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మడకసిరి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, తదితరులు వున్నారు.

# ఉల్లి రైతులు నష్టపోకుండా కొనుగోళ్లు నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు, పెన్ పవర్ సెప్టెంబర్ 01 :** ఉల్లి రైతులు నష్టపోకుండా కొనుగోళ్లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో పర్యటించి, ఉల్లి కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, అగ్రికల్చర్ అండ్ మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లి రైతులు ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల మేరకు మార్క్ ఫెడ్ ద్వారా క్వింటాల్ ఉల్లి పంటను రూ.1200/- లకు కొనుగోలు చేస్తున్నామన్నారు.... మార్కెట్ యార్డ్ కు వచ్చిన ఉల్లి పంటను క్వింటాల్ రూ.1200/- లకు కొనుగోలు చేయాలని కలెక్టర్ మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు.. మార్కెటింగ్ ఏడి నిర్దేశించిన ఇండెంట్ ప్రకారం రైతు బజార్లకు ఉల్లిని తరలించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు మిగిలిన నిల్వలను గో డౌన్ లో ఉంచి అవసరం బట్టి ట్రాన్స్పోర్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు.. ఇప్పటివరకు ఎంత ట్రేడింగ్ చేశారనే వివరాలను కలెక్టర్ మార్కెట్ యార్డ్ సెక్రెటరీ, మార్క్ ఫెడ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు..అక్కడే ఉన్న ఉల్లి రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక ఉల్లి రైతు కూడా నష్ట పోకూడదనే రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ మాసంలో కూడా కొనసాగించడం జరుగుతుందన్నారు. కావున రైతులు పంట కోతకు వచ్చేవరకు తమ పొలంలో ఉంచి గడ్డ మంచి సైజుకు వచ్చిన తరువాత కోత మొదలు పెట్టాలని, మరియు ఉల్లి గడ్డలను బాగా ఆరబెట్టుకుని మార్కెట్ కి తీసుకురావాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డిఎం రాజు, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి టి.జి.భరత్






**కర్నూలు, పెన్ పవర్ సెప్టెంబర్ 01 :** రైతులకు ఎల్లప్పుడూ అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఉల్లి రైతులతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి రైతులు తీసుకొచ్చిన దిగుబడులను పరిశీలించి వారితో మాట్లాడారు. ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామస్తులు ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామస్తులు చిన్న నరసన్న, గోనెగండ్ల మండలం ఆల్వాల్ గ్రామస్తులు రామాంజనేయులు మొదలగు రైతులతో వారు పండించిన ఉల్లిని పరిశీలించి వారితో వారి దిగుబడులు ఏ విధంగా వచ్చినది అడిగి తెలుసుకున్నారు వారు ఎంత ఖర్చు పెడితే ఎంత ఉల్లి దిగుబడి వచ్చినది వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడు తూ అధిక వర్షాల వల్ల పంట నష్టం చాలా ఉన్నదని, దిగుబడి తగ్గిపోయినదని కావున మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇంకా సాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ వారితో మాట్లాడుతూ... గత మూడు రోజులుగా రైతులు తమ ఉల్లి పంటను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకురావడం, వారు పడుతున్న ఇబ్బందులను గమనించడం జరిగిందని వెంటనే అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి ఈ విషయం తీసుకుని వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలబడాలని నిశ్చయించి నదని తెలిపారు.

చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని క్వింటాలుకు 1200 రూపాయలు చొప్పున మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశించి ఈరోజు నుండి కొనుగోలు ప్రారంభించినట్లు మంత్రి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఇబ్బంది పడకూడదని, నష్ట పోకూడదు అన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వతహాగా ముందుకు వచ్చి కేజీ 12 రూపాయలు చొప్పున కొనడానికి నిశ్చయించి ఈ రోజు నుండి కొనుగోలు ప్రారంభించిందని రైతులకు తెలియజేశారు. ఇటువంటి మంచి పనులు చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని, ఇది కేవలం ఆయనకే సాధ్యం అని మంత్రి టి.జి. భరత్ రైతులకు తెలియజేశారు. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోటానికి అధికారులతో సహకరించాలని, మెత్తబడిన ఉల్లిని వేరు చేయాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డును, బ్యాంక్ అకౌంట్ నంబరు, ఈపాస్ రిసిప్ట్ మొదలగునవి అధికారులకు ఇచ్చినట్లు అయితే ఒక వారం లోపల మీ ఉల్లి డబ్బులు మీ బ్యాంక్ అకౌంట్ లో జమ చేయబడుతాయని కావున రైతులు సహకరించాలని మంత్రి కోరారు. ఈ పర్యటనకు కడప జేడీ మార్కెటింగ్ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, కర్నూలు మార్కెటింగ్ ఏడి నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ హజ్మత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మరియు కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



**కడప పెన్ పవర్, సెప్టెంబర్ 1 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జిలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..

1) చక్రాయిపేట మండలానికి చెందిన చెందిన వెంకటసుబ్బయ్య ఊరు నందు సొంత భూమి ఉందని ఆ భూమిని ఆక్రమించారని తగు విచారణ జరిపించి మా భూమిని మాకు ఇప్పించాలని కోరుతూ అర్జీని సమర్పించారు. 2)కమలాపురం మండలం వికలాంగుల కాలనీకి చెందిన బి పుల్లయ్య కొందరు వ్యక్తులు భూమి ఆక్రమించారని, తగు విచారణ జరిపించి మాకు భూమిని ఇప్పించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ పై అరవై రోజుల విస్తృత ప్రచారం కల్పించాలని గోడప్రతులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌కి ఘన స్వాగతం





**కడప, పెన్ పవర్ సెప్టెంబర్ 01 :** వైయస్సార్ కడప జిల్లాలో సెప్టెంబర్ 2వ తేదీ మంగళ వారం జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం రాత్రి 9.20 గం.లకు కడప విమానాశ్రయమునకు చేరుకున్న రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర చేనేత,జౌళి శాఖామంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈ జీ అశోక్ కుమార్, ప్రభుత్వ విప్ మరియు కడప శాసన సభ్యురాలు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి,కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, మదనపల్లి శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి,పుట్టా సుధాకర్ యాదవ్, ఎన్. వరదరాజులు రెడ్డి,షాజహాన్ భాష, జమ్మలమడుగు ఆర్ డి ఓ సాయి శ్రీ,మాజీ ఎంఎల్ఏలు విజయమ్మ,లింగా రెడ్డి లు నాయకులు రెడ్డప్ప గారి శ్రీనివాసుల రెడ్డి, రితేష్ రెడ్డి,బి టెక్ రవి,భూపేష్ రెడ్డి,సుంకర శ్రీనివాస్,ప్రజా ప్రతినిధులు, అభిమానులు స్వాగతం పలికారు. సోమవారం రాత్రి బస చేసి మంగళవారం కమలాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

# నందీశ్వర స్వామి దేవస్థానాన్ని నిర్మించడం హర్షనీయం

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**





**వేంపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** కడప జిల్లా, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో, వేంపల్లి మండలం ,నంది పల్లె గ్రామంలో గ్రామ ప్రజలు ,దాతల, ప్రభుత్వ సహకారంతో మూడున్నర కోట్ల రూపాయల అంచనా విలువలతో సర్వాంగ సుందరంగా నందీశ్వర స్వామి దేవస్థానాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్మిస్తూ ఉన్నారు. నంది పల్లె గ్రామ సర్పంచ్ ,శ్రీ నందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి శనివారం నిర్మాణ దశలో ఉన్న శ్రీ నందీశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పులివెందుల - వేంపల్లి నాలుగు వరుసుల రోడ్డు పక్కన ప్రశాంతమైన వాతావరణంలో ,ఆధ్యాత్మిక వాతావరణంలో నందీశ్వర స్వామి దేవస్థానం నిర్మాణం అవుతోందని, ప్రత్యేకించి గ్రామం పేరు నంది పల్లెకు తగ్గట్టుగా నంది విగ్రహం చూడ ముచ్చటగా ఉందని తులసి రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, నందీశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి, కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామగంగి రెడ్డి, రామలింగేశ్వర్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచండి

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**డోన్, పెన్ పవర్ సెప్టెంబరు, 01 :** ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం డోన్ డివిజన్ కేంద్రంలోని డోన్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్జీదారుల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ లో ఆళ్లగడ్డ, బండి ఆత్మకూరు, కొత్తపల్లి, పగిడ్యాల, ఉయ్యాలవాడ మండలాల్లో మిశ్రమ స్పందన వస్తుందని అందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నాయని రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. రానున్న రోజుల్లో అర్జీలను ఆడిట్ చేసే సమయంలో అర్జీదారుని వాయిస్ కూడా వారి సమ్మతితో రికార్డు చేసి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు అధికారులు జాగ్రత్తగా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో వినాయక చవితి నిమజ్జన వేడుకలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేసిన జిల్లా అధికారులకు కలెక్టర్ అభినందించారు. అదే విధంగా జిల్లాలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం చర్యలు తీసుకోవాలని మున్సిపల్, నీటి వనరులు, మత్స్యశాఖ, ఆర్ అండ్ బి, అగ్నిమాపక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం కౌశలం అనే యాప్ ద్వారా పదవ తరగతి నుండి పై చదువులు చదివిన యువత వివరాలను నమోదు చేయడం జరుగుతోందన్నారు. తద్వారా రాష్ట్రంలో సుమారుగా ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

**పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన కొన్ని అర్జీలు :** 1. పాపిలి మండలం, పిఆర్ గ్రామానికి చెందిన వడ్డే వెంకటరాముడు తనకు పిఎం కిసాన్ పథకం వర్తించలేదని అధికారులు పరిశీలించి పీఎం కిసాన్ పథకాన్ని వర్తింపజేయాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. 2. డోన్ మండలం డోన్ గ్రామానికి చెందిన పెద్ద సుబ్బయ్య తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్కు అర్జీ సమర్పించారు. 3.పాపిలి మండలం, పాపిలి గ్రామానికి చెందిన ఎస్. వేదవతి తాను డిగ్రీ వరకు చదువుకున్నారని తనకు ఉపాధి కల్పించాలని పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డోన్ డివిజన్ నుంచి ప్రజల వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు దరఖాస్తులు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీఓ నరసింహులు, మున్సిపల్ కమీషనర్ ఎస్.ప్రసాద్ గౌడ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా గురించి రైతులు ఎవ్వరు ఆందోళన చెందరాదు

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, పెన్ పవర్ సెప్టెంబరు 1 :** నేడు ఒరిస్సా పోర్టు నుంచి 2600 మెట్రిక్ టన్నుల యూరియా నంద్యాల జిల్లాకు బయలుదేరిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈనెల 3న బుధ వారం సాయంత్రానికి యూరియా జిల్లాకు చేరే అవకాశం ఉందన్నారు. జిల్లాలో యూరియా గురించి రైతులు ఎవ్వరు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. యూరియా వినియోగాన్ని కూడా అవసరం మేరకే రైతులు వినియోగించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డా.సరితకు మదర్ థెరిసా" అవార్డు.. వీసీ ప్రశంసలు



**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సరితకు "మదర్ థెరిసా" అవార్డు లభించింది. మదర్ థెరిసా పుట్టినరోజు వేడుకల సందర్భంగా విజయవాడలోని ఎక్స్-రే లిటరరీ కల్చరల్ , సర్వీస్ ఆర్గనైజేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. జాతీయ సేవా పథకం ద్వారా సమాజానికి అందించిన సేవలను గుర్తించి 2022 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గా, 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఒకవైపు సామాజిక సేవలో మరోవైపు బోధనా, పరిశోధన రంగంలో పేటెంట్ సైతం అందుకున్న డాక్టర్ సరితను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారు. సమాజానికి ఆమె చేసిన అంకితభావ సేవల ఆధారంగా ఈ గుర్తింపు లభించిందని విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ ప్రశంసించారు. సహచర అధ్యాపకులు డాక్టర్ సరితను అభినందించారు.

## వైయస్సార్ జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఘన స్వాగతం



**పులివెందుల పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** వైఎస్సార్సీపీ శ్రేణులకు వైయస్ జగన్ భరోసా...క్యాంప్ కార్యాలయంలో ప్రజలతో మమేకం అయ్యారు. ప్రజాదర్బార్ లో కలిసిన వారి యోగక్షేమాలు తెలుసుకున్న శ్రీ వైయస్ జగన్ , నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పులివెందుల లోని క్యాంప్ కార్యాలయం నందు జననేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి కలిసిన జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, కడప ఎంపీ శ్రీ వైయస్ అవినాష్ రెడ్డి గారు, మాజీ డిప్యూటీ సీఎం శ్రీ ఎస్.బి.అంజాద్ బాషా గారు, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు గారు, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా గారు, ఎమ్మెల్సీలు రామ సుబ్బారెడ్డి గారు, రమేష్ యాదవ్ గారు, రామచంద్రా రెడ్డి గారు, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి గారు, కొరముట్ల శ్రీనివాసులు గారు, సుధీర్ రెడ్డి గారు, శ్రీకాంత్ రెడ్డి గారు, ఆర్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల నాని గారు, కమలాపురం అసెంబ్లీ ఇంచార్జ్ నరైన్ రామాంజనేయులు రెడ్డి , సీనియర్ నాయకులు సుకవాసి సుబ్రమణ్యం గారు తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు వైయస్ జగన్ సూచించారు.

## ఒక ఆలోచన.... ఈ ప్రపంచాన్ని నడిపించేది ఎవరు?

– ప్రకృతి నియమాలను ఎవరూ తప్పించుకోలేరు



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS


**కడప, పెన్ పవర్ :** విష్ణువు గరుత్మంతుడిని అధిరోహించి కైలాస పర్వతానికి వెళ్ళాడు. గరుత్మంతుడిని ద్వారం వద్ద వదిలి, శివుడిని కలవడానికి లోపలికి వెళ్ళాడు. గరుత్మంతుడు కైలాసపర్వత సౌందర్యాన్ని చూసి మంత్రముగ్ధుడయ్యాడు, అతని కళ్ళు అక్కడ ఉన్న ఒక అందమైన చిన్న పక్షిపై పడ్డాయి. పక్షి ఎంత అందంగా ఉందంటే, గరుత్మంతుని ఆలోచన లన్నీ దానివైపు లాగడం ప్రారంభించాయి. ఇంతలో యమధర్మరాజు కైలాసానికి వచ్చి, లోపలికి వెళ్ళే ముందు ఆ చిన్న పక్షిని ఆశ్చర్యంగా చూశాడు. గరుత్మంతునికి ఆ చూపులోని భావం అర్థం అయ్యింది, పక్షి అంతం దగ్గర పడిందని, కైలాస పర్వతం నుండి బయలుదేరినప్పుడు యమధర్మరాజు ఆ పక్షిని తనతో పాటు యమలోకానికి తీసుకువెళతాడని గ్రహించాడు. ఇంత చిన్నగా ఉన్న ఆ అందమైన పక్షి చనిపోవడం అంటే తట్టుకోలేకపోయాడు, ఆ పక్షి మీద జాలిపడ్డాడు. అందువల్ల ఆ పక్షిని పట్టుకుని వేల మైళ్ల దూరంలో ఉన్న అడవిలో ఒక రాతిపై వదిలి, కైలాసానికి తిరిగి వచ్చాడు. యముడు బయటకు రాగానే గరుత్మంతుడు,"ఆ పక్షిని అంత ఆశ్చర్యంగా ఎందుకు చూశావు?", అనడిగాడు. యమధర్మరాజు ఇలా అన్నాడు, "గరుడా, కొన్ని క్షణాలలో, ఇక్కడకి వేల మైళ్ల దూరంలో ఉన్న ఒక పాము దానిని తింటుందని ఆ పక్షిని చూడగానే నాకు తెలిసింది, ఇంత త్వరగా ఇక్కడున్న పక్షి అక్కడకు ఎలా వెళ్తుందా అని నేను ఆశ్చర్యపోయాను, కానీ ఇప్పుడు అది ఇక్కడ లేదు అంటే పక్షి చనిపోయిఉండాలి." గరుత్మంతుడు అప్పుడు అర్థం చేసుకున్నాడు, " ఎంత తెలివైన వాడైనా మృత్యువును నివారించలేడు." అందుకే శ్రీకృష్ణపరమాత్మ ఇలా అంటారు – మీరు కోరుకున్నది మీరు చేస్తారు ... కానీ వాస్తవానికి నేను కోరుకున్నదే జరుగుతుంది. నేను కోరుకున్నది చేయండి ... అప్పుడు మీరు కోరుకున్నది జరుగుతుంది. ఈ ప్రపంచం సాధ్యాసాధ్యాల ప్రపంచం. సాధ్యమయ్యే సంఘటన సాధ్యమవటానికి చాలా అవకాశం ఉంది, కానీ అత్యంత అద్భుతమైన విషయం ఏమిటంటే, అసాధ్యమైన సంఘటన సుసాధ్యమయ్యే అవకాశం కూడా అంతే ఉంది.

**లాలాజీ**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాద బృందం ఆంధ్రప్రదేశ్**



తిరుమల తిరుపతి దేవస్థానానికి టాటా వెహికల్ బహూకరణ చేసిన ఓ భక్తుడు

# డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి-జీవిత చరిత్ర



పూర్తి పేరు: యెడుగురి సందింటి రాజశేఖర రెడ్డి

జననం: జూలై 8, 1949–పులివెందుల, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్

తల్లిదండ్రులు: వై.ఎస్. రాజారెడ్డి (ప్రముఖ దాత, కాంట్రాక్టర్)

విద్యాభ్యాసం : గుల్బర్గాలోని ఎంఆర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. వైద్యుడిగా కొంతకాలం సేవలందించారు.

రాజకీయ జీవితం : కాంగ్రెస్ పార్టీతో రాజకీయాల్లో ప్రవేశం.

1978లో మొదటిసారి ఎమ్మెల్యేగా పులివెందుల నియోజకవర్గం నుంచి గెలిచారు. అనంతరం పలు సార్లు కడప ఎంపీగా ఎన్నికయ్యారు.

ప్రధాన మలుపులు : 1999: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. 2003: రైతుల సమస్యలు తెలుసుకోవడానికి 1,450 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి ప్రజల్లో అపార ప్రజాదరణ పొందారు. 2004: కాంగ్రెస్ పార్టీని ఘనవిజయానికి నడిపించి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2009: వరుసగా రెండోసారి ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా కొనసాగారు.

ప్రజా సంక్షేమ పథకాలు : వైఎస్ఆర్‌ను ప్రజలు "ప్రజానాయకుడు"గా గుర్తుంచుకుంటారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు:

ఆరోగ్యశ్రీ: పేదలకు ఉచిత వైద్యం.

ఫీజు రీయింబర్స్‌మెంట్: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్య.

జలయజ్ఞం: కరువుప్రాంతాలకు నీరు అందించడానికి భారీ సాగు ప్రాజెక్టులు.

పావలా వడ్డీ: మహిళల స్వయం సహాయక సంఘాలకు తక్కువ వడ్డీ రుణాలు.

ఇందిరమ్మ ఇళ్ళు: పేదలకు ఉచిత గృహాలు.

108 అంబులెన్స్ సేవలు: గ్రామీణ ప్రాంతాలకు వేగవంతమైన వైద్య సేవలు.

విచారకర మరణం : 2 సెప్టెంబర్ 2009న నల్లమల అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ఆర్ దురదృష్టవశాత్తు మరణించారు. ఆయన మరణం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర షాక్ ఇచ్చింది. లక్షలాది మంది ప్రజలు స్వయానా కుటుంబ సభ్యుని కోల్పోయినట్లుగా పోయారు.

వారసత్వం : వైఎస్ఆర్‌ను ప్రజలు నేటికీ "రాజన్న"గా పిలుచుకుంటారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2011లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి ప్రజా నాయకత్వాన్ని కొనసాగించారు. వైఎస్ఆర్ పేరు నేటికీ ఆంధ్రప్రదేశ్ లో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచింది. అప్పల రెడ్డి సింధు వైద్య విభాగం వైఎస్ఆర్సిపి. కడప జిల్లా.

# ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్



**కర్నూలు, పెన్ పవర్ సెప్టెంబర్ 01 :** కూటమి ప్రభుత్వం కు ప్రజల సుఖ సంతోషాలు ముఖ్యమని అందుకే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ అన్న ప్రశంస తెచ్చుకున్నదని వాణిజ్యం, పరిశ్రమలు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సందర్భంగా పేర్కొన్నారు. సోమవారం ఉదయం కొత్తపేటలోని క్లస్టర్ 12 మంగలి వీధిలో మంత్రి టి. జి. భరత్ 15 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు విచారించి పెన్షన్ల పంపిణీ చేశారు. మంత్రి ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగాపని చేస్తున్నది అన్న విషయాలు వారిని ప్రశ్నించగా వారు మేము ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నామన్న విషయం తెలియజేశారు. ఈ కూటమి ప్రభుత్వం ఒకటో తారీకు సెలవు దినమైనప్పుడు పెన్షన్ ను ఒక రోజు ముందుగానే అందజేస్తుందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెయ్యి రూపాయల మొత్తాన్ని ఒకటేసారి పెంచి 4000 ఇస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అన్నిటిని అమలు చేసి సూపర్ హిట్ అన్న ప్రశంస తెచ్చుకుందని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు వారి వీధిలో ఉన్న సమస్యలను మంత్రి ముందుకు తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా వారు కరెంటు పోల్ లు పాతవి అయిపోయాయి అని,తీగలు క్రింద కుఉండి చాలా ఇబ్బంది కలిగిస్తున్నాయని వాటిని మార్చాలని కోరారు.మంత్రి సమాధానమిస్తూ కర్నూలు పట్టణంలో ఇప్పటివరకు 200 ఎలక్ట్రికల్ పోల్లను మార్పించడం జరిగిందని ఇక్కడ కూడా మార్పు చేయిస్తానని, ఒక ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమాన్ని త్వరలో చేపడతామని తెలిపారు. మురుగు కాలువలు నీటి ప్రవాహం సరిగా లేదని తెలుపగా కొత్తగా కాలువల నిర్మాణం మీ కోరిక పైనే నిర్మించడం జరిగిందని కొంతమంది కాలువ నీరు తమ ప్రాంతం గుండా వెళ్లడానికి ఇష్టపడడం లేనందున ఇటువంటి సమస్యలు వస్తున్నాయని వీటిని వెంటనే సరి చేస్తామని ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఒక చిన్నారి, కార్తికేయ ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఉత్తరం వ్రాసినది ఇంకా సొమ్ము రాలేదని వారు కోరగా మంత్రి వెంటనే ఫోన్ ద్వారా సంబంధిత అధికారికి తెలిపి ఆలస్యానికి కారణమైన విషయం కనుక్కోమని చెప్పారు. కొంతమంది మహిళలు టిడ్ కో గృహాలు ఇంకా కేటాయించలేదని గుర్తు చేయగా డిసెంబర్ నాటికి టిడ్ కో గృహాలు కేటాయించేలాగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఇంకా 20 సంవత్సరాలు రాష్ట్రంలో పరిపాలన చేయగలిగితే అద్భుతాలు సృష్టించబడతాయని, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని మంత్రి టి.జి. భరత్ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ మాట్లాడుతూ...ప్రజలు మంత్రిగారి దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలన్నిటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ ,డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సిపిఓ, భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ అందించిన సేవలు శ్లాఘనీయం : కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, పెన్ పవర్ సెప్టెంబర్ 01:** పదవీ విరమణ చేసిన సిపిఓ, భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ అందించిన సేవలు శ్లాఘనీయం అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రశంసించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సిపిఓ గా పదవీ విరమణ చేసిన హిమ ప్రభాకర్ రాజు భూగర్భ జల శాఖ శాఖ డిడి శ్రీనివాసరావు గార్లను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని తెలిపారు.. అయితే సర్వీస్ లో ఎంతవరకు ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాం, ఎంత మందికి సహాయం చేశాం అన్నదే ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అంశంలో సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, భూగర్భజల శాఖ డిడి శ్రీనివాసరావు ఇద్దరూ సమర్థవంతంగా తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించారని కలెక్టర్ పేర్కొన్నారు. సిపిఓగా హిమ ప్రభాకర్ రాజు జిల్లా, నియోజకవర్గ విజన్ ప్లాన్లతో పాటు జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించారని, అలాగే పి 4 పాలసీ అమలులో విజయం సాధించారని కలెక్టర్ ప్రశంసించారు..అలాగే భూగర్భ జల శాఖ డిడి శ్రీనివాసరావు హయాంలో కరవు జిల్లా అయిన కర్నూలు జిల్లాలో భూగర్భ జల స్థాయిని 7.80 మీటర్ల లో ఉండడం అభినందనీయం అని, ఇద్దరు అధికారులు మంచి సేవలు అందించారని కలెక్టర్ ప్రశంసించారు..పలువురు జిల్లా అధికారులు ఇద్దరు అధికారులతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ వారు అందించిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ చేసిన సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, భూగర్భ జల శాఖ డిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా కలెక్టర్లకు జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇద్దరు అధికారులను జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సి వెంకటనారాయణమ్మ, పిడి హౌసింగ్ చిరంజీవి, జడ్పి సీఈవో నాసర రెడ్డి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, డ్వా మా పిడి వెంకటరమణయ్య, ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, మైనింగ్ డిడి రవిచంద్, డిఎస్ఓ రఘువీర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, గ్రౌండ్ వాటర్ డిడి సన్నన్న, సిపిఓ భారతి, డిటిసి శాంత కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, డిడి సోషల్ వెల్ఫేర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ ఉమైర్ ఘన సన్మానం




**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** కడప నగరంలోని మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాష గారి నివాస కార్యాలయం నందు గల్ఫ్ కన్వీనర్ మరియు కడప నార్త్ జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్ గారి ఆధ్వర్యంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన షేక్ ఉమైర్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం శ్రీ ఎస్.బి. అంజాద్ భాష హాజరై, ఉమైర్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చాక్లెట్ గౌస్, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య,కార్పొరేటర్ జిలాన్, నగర్ ఐటి విభాగం అధ్యక్షుడు నందలూరు ఫయాజ్,నాయకులు బయాజ్, బాబు, ఇబ్రహీం మియా,సలీం సాహెబ్, ఫారూఖ్, అన్వర్, జహీర్ తదితరులు ఉన్నారు.



కడప టిడిపి అధ్యక్షులు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

## రహస్యం.... బాపూజీ మహారాజ్




బాబూజీ గారు ఒక రహస్యం చెప్పారు. ధ్యానం, నిర్మలీకరణ, నిరంతర స్మరణ వీటన్నిటికంటే సేవ ద్వారా వెయ్యిరెట్లు లబ్ధి లభిస్తుంద న్నారు. ఊడ్చే పని ఉంటే, ఊడవండి,మరుగుదోడ్డి శుభ్రం చేయవలసి ఉంటే, చేయండి. కాపలా ఉండ మంటే ఉండండి. అంతేగాని అందరూ ధ్యానమందిరానికి వెళ్తున్నారు, నాకిదేంపని అని అనుకోకండి.మాష్టరు ఆజ్ఞాపించారు,మనం సైనికుడివలే పాటించాలి." వీటి వల్ల వచ్చేలాభం ధ్యానంవల్ల కూడారాదు. నేను ధ్యానం చేస్తున్నవారికంటే,సేవచేసే వారిని ఎక్కువ గమనిస్తాను.పనిలో లీనమైన వారికి లాలాజీ సహకారం అన్నివిధాలా ఉంటుంది"అన్నారు బాబూజీ. నాప్రార్థనకూడా అదే."బాబూజీ ముందు వారికి ఇచ్చి తరువాత మిగతావారికివ్వండి."అని అనేకమార్లు ప్రార్థించేవాడిని.(చారీజీమహరాజ్)

## నిత్యం అందుబాటులో... ఫణి భూషణ రెడ్డి...



**కడప పెన్ పవర్ సెప్టెంబరు 1 :** సోమవారం ఉదయం 7:00 కు ప్రారంభం అయిన పింఛన్ పంపిణి కార్యక్రమం. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి కడప నియోజకవర్గం ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి గార్ల ఆదేశాల మేరకు... 12వ డివిజన్ లో డివిజన్ ఇంచార్జ్ సగిలి మణి భూషణ రెడ్డి గారి ఆధ్వర్యంలో పింఛను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫణి భూషణ రెడ్డి, శశి భూషణ్ రెడ్డి, బూత్ ఇంచార్జిలు మరియు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడం జరిగినది. ప్రతి నెల లాగే ఒకటో తేదీనే తమ అవసరాలను గుర్తించి సమయానికి పింఛన్ అందజేస్తున్న ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. నియోజక అభివృద్ధికై అహర్నిశలు కృషి చేస్తున్న కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారి మాధవి రెడ్డి గారికి ప్రజలందరూ ధన్యవాదములు తెలిపారు.

## మానవత్వం చూపిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



**జమ్మలమడుగు పెన్ పవర్ ఆగస్టు 31 :** జమ్మలమడుగు వేపరాల నందు నివాసం ఉంటున్న చిమ్మని వెంకట రమణ (32) అనే వ్యక్తి నీటిలో పడి మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బందువులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఈరోజు సాయంత్రం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్,సుబహాన్, కృపా అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు,ప్రసన్న కుమార్, సురేష్, మైకేల్ బాబు మరియు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. మా శ్రీ అమ్మ శరణాలయం లోని వృద్దులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే ఈ నెంబర్లను సంప్రదించ వలసిందిగా కోరుచున్నాము. 82972 53484, 9182244150.

## మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. ప్రారంభానికి ముస్తాబు...





**పెండ్లిమర్రి పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** వైఎస్ఆర్ జిల్లా, పెండ్లిమర్రి మండలం చెర్లోపల్లె పంచాయతీ బైరవగుట్టపై అధునాతన వసతులతో నిర్మించిన మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించేందుకు సన్నాహక ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, హాజరైన సంబంధిత శాఖల

# పిజిఆర్ఎస్, కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**అనంతపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లోసోమవారం సాయంత్రం పిజిఆర్ఎస్ కార్యక్రమం పై జాయింట్ కలెక్టర్ శివ నారాయణన్ శర్మ తో కలిసి జిల్లా అధికారులు డివిజన్ స్థాయి మరియు మండల స్థాయి అధికారులు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి .ఐఏఎస్ పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. ఫిర్యాదు దారులు ఇచ్చిన అర్జీలను అవగాహన చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా అర్జీలను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసి రసీదులను కచ్చితంగా అందజేయాలని ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో విధిగా డివిజన్ మరియు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. మరి ముఖ్యంగా ఏజెంట్ స్పేస్ (%జుూూ%) పోర్టల్ నందు డాక్యుమెంట్ అప్లోడ్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి...

జిల్లాలో నేషనల్ హైవే కు సంబంధించి పెండింగ్ ఉన్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులు, వివిధ కంపెనీ కాంట్రాక్టర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి ఐఏఎస్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్ హెచ్ 544- డి పనులు అలాగే నేషనల్ హైవే 42 పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ చోట్ల చేపట్టిన పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతపురం నుండి తాడపత్రి భోగసముద్రం వరకు జరుగుతున్న పనులు అలాగే అనంతపురం రూరల్ మండలంలోని సోమల దొడ్డి నుంచి ముచ్చుకోట , బుగ్గ వరకు జరుగుతున్న పనులు

అనంతపురం ఎస్కేయూ రాప్తాడు బత్తలపల్లి వైపు జరుగుతున్న పనుల ప్రగతిపై వివరాలను సంబంధిత అధికారుల ద్వారా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆర్డీఓ లు, తాసిల్దారులు, ఎన్ హెచ్ అధికారులు మరియు కాంట్రాక్టర్లు సమన్వయంతో పెండింగ్లో ఉన్న పనులన్నీ కూడా పూర్తి చేయాలన్నారు. భూ సేకరణ లో భాగంగా కుటుంబ తగాదాలు, కోర్టు కేసులు, అక్రమ భూ కబ్జా కుటుంబ అవార్డు చెల్లింపులు తదితర అంశాలపై దృష్టిని సారించాలని దీనికై సంబంధిత శాఖలో చేతన స్థాయిలో పర్యటించి వాస్తవ స్థితిగతులను గ్రహించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలుతీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తాను కూడా త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నాణ్యతను పరిశీలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఏవైనా ఆటంకాలు సమస్యలు ఉంటేతనదృష్టికితీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ, డిఆర్ఓ మలోలా ఎన్ హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తరుణ్ కుమార్, మేనేజర్ మురళి, నేషనల్ హైవే ఈఈ సుధాకర్ రెడ్డి,ఎస్ ఆర్ సి మరియు మెగా ఇంజనీరింగ్ కాంట్రాక్టర్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి హామీపనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష :** జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ,వి.ఐఏఎస్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి ఉపాధి హామీ పథకం పనులు ,హౌసింగ్ తదితర అంశాలపై డ్వామా పిడి సలీం భాషాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు హౌసింగ్ అధికారులు, ఏపీడీలు ,ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులలో నిర్లక్ష్యం వహించరాదని, క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు పనులపై పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ వర్షాకాల సమయంలో విస్తృతంగా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు.

వజ్రకరూర్ బొమ్మనహల్ విడపనకల్ బెలుగుప్ప ఉరవకొండ కనేకల్ తదితర మండలాల్లో ఉపాధి హామీ పనులు చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయని వాటన్నింటినీ సత్వరమే పూర్తి చేయు విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ కు సంబంధించి జిల్లాకు కేటాయించిన ఇళ్ళ నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందులో విడపనకల్లు, కుందుర్పి మండలాలు వెనుకబడి ఉన్నాయని అందువల్ల లక్ష్యాలను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా జల సంజయ్ జన్ భాగీరథ పనులకు సంబంధించి పోర్టల్ లో మండలాల వారిగా అప్లోడ్ చేయాలని ఎంపీడీవోలకు ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కూలీలకు కనీస వేతనం అందాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగానే పురోగతి ఉండాలని పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు బిటి రోడ్లు ట్రెన్స్ పల్లె పవనాలు అవెన్యూ ప్లాంటేషన్ బ్లాక్ ప్లాంటేషన్ మునగ ప్లాంటేషన్, డైలీ లేబర్ బడ్జెట్ రూఫ్ స్టాఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ తదితర పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి ఆదేశించారు.

## చంద్రబాబుకు అభినందనలు తెలియజేసిన రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి



కడప పెన్ పవర్ సెప్టెంబర్ 1 : నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలియజేశారు. 1995లో తొలిసారి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ప్రజాసేవలోకి అడుగుపెట్టిన నారా చంద్రబాబు నాయుడు గారు ఈ రోజు మూడు దశాబ్దాలను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీనివాసరెడ్డి గారు మాట్లాడుతూ "సరిగ్గా 30 సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు గారు దూరదృష్టి కలిగిన నాయకుడు. రాబోయే 50 సంవత్సరాల అభివృద్ధి అవసరాలను ముందుగానే ఊహించి, బాటలు వేసిన వ్యక్తి. ఆయన వల్లే ఈరోజు హైదరాబాద్ అంటే-అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్, సైబరాబాద్, హైటెక్ సిటీ గుర్తుకు వస్తాయి. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం ఆయన సంకల్పానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. "చంద్రబాబు నాయుడు గారు అంటే దేశానికి, ప్రపంచానికి తెలిసిన పేరు. రాబోయే రోజుల్లో అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేసి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ఆయన సంకల్పం. భవిష్యత్తులో కూడా యువతకు మార్గదర్శకుడిగా నిలిచే చంద్రబాబు గారు ఎల్లప్పుడూ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి, ఇంకా ఎన్నో విజయాలు సాధించేలా దీవించాలి" అని అన్నారు. "ఆ రోజు నుంచి నేటి వరకు-సమైక్య ఆంధ్రప్రదేశ్ కాలం నుండి నవ్యాంధ్ర ప్రదేశ్ వరకు అభివృద్ధి నిర్మాణం, సాంకేతిక విప్లవం, మహిళల సాధికారత, రైతు సంక్షేమం, యువత ఉపాధి-ప్రతి రంగంలోనూ చంద్రబాబు గారి ముద్ర ఉంది. ప్రజాస్వామ్యం, అభివృద్ధి, సంక్షేమం అనే మూడు స్తంభాలపై రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న మన నాయకుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరింత బలంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది" అని శ్రీనివాసరెడ్డి గారు స్పష్టం చేశారు.

## మన్సూర్ అలీ ఖాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**- టిడిపి జిల్లా అధ్యక్షులు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి**





**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** టీడీపీ సిటీ వైస్ ప్రెసిడెంట్ లయన్ మన్సూర్ అలీ ఖాన్ గారి పుట్టినరోజు సందర్బంగా ఎమ్మెల్యే నివాసం నందు పొలిట్ బ్యూరో సభ్యులు కడప జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీనివాస రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఇలాంటి పుట్టినరోజు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ మరియు తెలంగాణ రీజినల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి మనోబంధు, విద్యా బంధు, స్నేహశీలి, నిరంతర సేవా తత్పరుడు, లయన్ కాసిం ఖాన్ తనయుడు మన్సూర్ ఖాన్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన హ్యూమన్ రైట్స్ కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలొ జావీద్,తోసిఫ్,అమీన్, షఫీ, సాదక్ హుస్సేన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి క్షణం మన మనస్సు

# కోరికలతో నిండిఉంటుంది

**కానీ మన హృదయం ఏమి కోరుకుంటుందో, అది మనం ఎప్పుడైనా తెలుసుకున్నామా? : డాక్టర్ సునీత**



**కన్హ పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** భగవంతుడు లేదా భగవంతుని మహిమ పాండవులు, కౌరవుల మధ్య యుద్ధ సన్నాహాలు చివరి దశలో ఉన్నాయి. యుద్ధంలో తమ పక్షం వహించమని శ్రీకృష్ణుడిని అభ్యర్థించాలని పాండవులు భావించారు. ఈ విషయమై ఆయనను కలవాలన్న ఆలోచనతో, అర్జునుడు వెంటనే ద్వారకకు బయలుదేరాడు. ఆ కురుక్షేత్ర యుద్ధంలో శ్రీకృష్ణుడి పాత్ర చాలా కీలకమైనది, అందు వల్లనే దుర్యోధనుడు కూడా శ్రీ కృష్ణుడిని సంప్రదించి యుద్ధంలో కౌరవుల పక్షం వహించమని అభ్యర్థించాలనుకున్నాడు. ఈ ఆలోచనతోనే దుర్యోధనుడు కూడా శ్రీకృష్ణుడిని కలవడానికి ద్వారక చేరుకున్నాడు. ముందుగా వచ్చిన దుర్యోధనుడు, శ్రీకృష్ణుడు విశ్రాంతి తీసుకోవడం చూసి, ఆయన కాళ్ళ వద్ద కూర్చోవడం ఇష్టం లేక శ్రీకృష్ణుని తల వద్ద కూర్చున్నాడు. అర్జునుడు ద్వారక చేరుకున్నప్పుడు, విశ్రాంతి తీసుకుంటున్న శ్రీకృష్ణునిని చూసి, ఆయన నిద్రకు భంగం కలిగించకూడదనే ఆలోచనతో, అర్జునుడు సాష్టాంగ నమస్కారం చేసి, చేతులు జోడించి, తలదించుకుని, ఆయన పాదాల వద్ద నిలబడ్డాడు. శ్రీ కృష్ణుడు మేల్కొనిన వెంటనే, తన పాదాల వద్ద నిలబడి ఉన్న అర్జునుడిని ముందు చూశాడు. ఆపై, లేవడానికి సిద్ధమవుతుండగా, దుర్యోధనుడు తన తల వద్ద కూర్చున్నట్లు గమనించాడు. వారిద్దరినీ చూసి శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు. వాళ్ల మనసులో ఏముందో ఆయనకి తెలుసు. ఆయన వారిని, "నేను మీ కోసం ఏమి చేయగలను?" అని అడిగాడు. దుర్యోధనుడు, అర్జునుడు ఇద్దరూ ఒకే ప్రతిపాదనతో వచ్చినందున, యుద్ధంలో తమ పక్షం వహించమని శ్రీకృష్ణుడిని వారిరువురూ అభ్యర్థించారు. అది విన్న శ్రీ కృష్ణుడు, "నాకు ఎలాంటి వివాదాలు వద్దు. అలాగని మీరిద్దరూ తప్పుగా భావించడం కూడా నాకు ఇష్టం లేదు. కాబట్టి, నేను భౌతికంగా ఒకరి పక్షం వైపు ఉంటాను, కానీ యుద్ధం చేయను, ఆయుధాలు పట్టను. నా నారాయణి సైన్యం మొత్తం ఇంకొకరి పక్షం వైపు ఉంటుంది, వారు ఆయుధాలతో వస్తారు, యుద్ధంలో పోరాడతారు. ఇప్పుడు మీరిద్దరూ ఎవరిని ఎంచుకోవాలనుకుంటున్నారో, ఆ ఎంపిక మీకే వదిలేస్తున్నాను", అని అన్నాడు.ఆపై కృష్ణుడు నవ్వుతూ, "నేను అర్జునుని ముందు చూసాను కాబట్టి, మొదట ఎంపిక చేసుకునే హక్కు అతనికే ఉంటుంది", అన్నాడు. అది విన్న దుర్యోధనుడు కంగారుపడ్డాడు. అర్జునుడు మాత్రం, "స్వామి! యుద్ధం చేయనప్పటికీ, మా పాండవుల పక్షాన మిమ్మల్నే ఉండమని నేను మిమ్మల్ని వ్యక్తిగతంగా అభ్యర్థిస్తున్నాను", అని మనవి చేసుకున్నాడు. అది విని దుర్యోధనునికి కొంత ఊరట కలిగి, ఒక దురుద్దేశపూరితమైన నవ్వుతో ఇలా అన్నాడు," అయితే మీ సైన్యం మొత్తాన్ని నేను తీసుకోవచ్చా?". శ్రీ కృష్ణుడు నవ్వుతూ, తల పంకించాడు.ఆ విధంగా, శ్రీ కృష్ణుడు వారిద్దరినీ తృప్తిపరిచాడు. చివరికి మహాభారత యుద్ధంలో పాండవులు గెలిచిన సంగతి మనందరికీ తెలిసిందే. భగవంతుడు, తనను తాను ఇవ్వకుండా, ప్రపంచంలోని అన్ని వైభవాలను మనకు అందజేసినా, వాస్తవానికి మనం ఏమీ సాధించలేం. కానీ ఎవరైనా భగవంతుడినే సంపూర్ణంగా కోరుకున్నప్పుడు, భగవంతునితో పాటు, ఆయనకు సంబంధించిన ప్రతిదీ మనకు లభిస్తుంది. బహుశా మహాభారతం మనకు ఇచ్చే మహోన్నతమైన ఉపదేశం ఇదేనేమో! భగవద్గీతను మనం సరిగ్గా అర్థం చేసుకుంటే, అది మన మనస్సును ఉన్నతమైన అవగాహనా స్థాయికి తీసుకెళుతుంది. అది మనల్ని జీవిత యుద్ధానికి సిద్ధం చేస్తుంది. జీవితంలోని రోజువారీ వ్యవహారాలలో మనం చేసే యుద్ధం కూడా ఏమీ తక్కువ కాదు.

**దాజీ**

**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం ?**



**నర్సారావు పేటకు చెందిన శ్రీ జె.రామాంజనేయులు శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు.**

# తిరుపతి జిల్లా... వినాయక నిమజ్జన ఉత్సవాలు



**- తిరుపతి ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు**

**తిరుపతి పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** పోలీసు నిబంధనలకు అనుగుణంగా డీజేలు లేకుండా వినాయక చవితి నిమజ్జనం ఉత్సవాలు నిర్వహించుకుని పోలీసు వారికి సహకరించిన జిల్లా వ్యాప్తంగా వినాయక విగ్రహాల పందిళ్లను ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిసిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు. వినాయక చవితి ఉత్సవాలలో డీజేలు వల్ల అనేకమంది ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో ఈసారి డీజే ల నిషేధిస్తున్నట్లు జిల్లా పోలీసు తరపున నుండి ప్రకటన విడుదల చేయడమైనది. పోలీస్ వారి విజ్ఞప్తులను తూచా తప్పకుండా జిల్లా వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పండుగతోపాటు నిమజ్జనం జరుపుకున్నారు. అయితే వినాయక చవితి ఊరేగింపులో యువకులకు ఉత్సాహం వచ్చేందుకు ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం డీజే ఏర్పాటుచేసి నిమజ్జన వేడుకలు జరుపుకుంటారు.

ఈ సంవత్సరం నిమజ్జనం వేడుకలలో డీజేలు వినియోగించవద్దని ఇలా వినియోగించడం ద్వారా అనేక అనర్థాలు జరుగుతున్నాయని పోలీసు వారు చెప్పిన విన్నపాన్ని జిల్లా ప్రజలందరూ క్రమం తప్పకుండా పాటించినందుకు సంతోషంగా ఉంది. అంతేకాకుండా విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగనది. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటి నుండి నిమజ్జనాలు జరుగుతున్న సమయం వరకు జిల్లావ్యాప్తంగా పోలీసు సిబ్బంది ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవడం జరిగింది. అంతేకాకుండా వినాయక చవితి పందిళ్ల వద్ద కమిటీ సభ్యులతో నిరంతరం పర్యవేక్షణ చేసి డీజే వల్ల జరుగుతున్న ఇబ్బందులపై కమిటీ సభ్యులకు వివరించడమైనది.

పోలీస్ వారు చెప్పిన విజ్ఞప్తులను కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించినందు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాము. దీంతో ఈ ఏడాది గణేష్ నిమజ్జనంలో డిజే లేకుండా భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయక వచ్చి నిమజ్జనం చేయటం చాలా సంతోషం గా ఉంది. మిగిలిన ఆరు రోజులు కూడా భక్తిశ్రద్ధలతో డీజే లేకుండా వినాయక నిమజ్జనం జరుపుకుంటారని ఆశిస్తున్నాము. పోలీసు నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన అలాంటి వారిపై చర్యలు తప్పవని మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేయడమైనది.

# వైయస్సార్ కడప జిల్లా పుష్పగిరి చిత్రాలు

## విచిత్ర శృంగార శిల్పం .... బొమ్మిశెట్టి రమేష్



**వల్లూరు పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** వల్లూరు మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ, పంచనదీ క్షేత్రం పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ గాలి గోపురం ఎడమవైపు ఉన్న శృంగార కుడ్య శిల్పం విచిత్రమైందని రచయిత,చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం అన్నారు. పురాతన కాలంలో అమాయకులకు శృంగార శాస్త్రం పై అవగాహన కల్పించేందుకు ఆలయాల గోడలపై ఇలాంటి శిల్పాన్ని చెక్కేవారని తెలిపారు. ఈ శిల్పం కేవలం కళాఖండం మాత్రమే కాదని ఆనాటి సమాజం, సంస్కృతి, జీవన విధానాలను, లైంగికతను, ఆనందాన్ని, సంతానోత్పత్తిని, ఆధ్యాత్మికతను సూచిస్తున్నాయని చెప్పారు. ఇది అలంకరణ కోసం మాత్రమే కాక ధర్మ, అర్థ, మోక్ష, కామ అనే పురుషార్థాలను కూడా ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. నాటి సమాజం యొక్క దృక్పథాన్ని, వారి నమ్మకాలను తెలియజేస్తున్నాయని అన్నారు. కొన్ని సంస్కృతులలో శృంగార భోగభాగ్యాలకు ,జీవిత ఆనందానికి ప్రతీక ఈ శిల్పం. ఆనందాన్ని ,జీవితాన్ని పూర్తిస్థాయిలో అనుభవించాలనే భావనను ఈ శిల్పం వ్యక్తం చేస్తోందని చెప్పారు.

ఆలయానికి ప్రవేశించే ముందు కామాన్ని, కోరికలను విడిచి పెట్టాలని చెప్పటానికి ఈ శృంగార శిల్పాన్ని గాలిగోపురంపై చెక్కారన్నారు. జీవితంలోని కోరికలను లోపల ఉన్నశక్తిని పెంపొందించుకోవడమే ఈ శిల్ప ఉద్దేశ్యమని తెలిపారు. ఈ శిల్పంలో ఇద్దరు స్త్రీలు, ఇద్దరు మగవారు ఉన్నారని చెప్పారు. ఎడమవైపు ఉన్న శృంగారపురుషుడు తలను, ఎడమ కాలును వంచగా మరొక పురుషుడు శృంగార పురుషుని తలను ఎడమచేతితో, ఎడమ పిక్కను కుడి చేతితో పట్టుకొని బాహ్యంగా మద్దతు ఇస్తున్నట్లుగా ఆనాటి శిల్పులు ఆసక్తికరంగా చెక్కారని వివరించారు. ఎడమవైపు శృంగార స్త్రీ తన తలను వంచి కుడి చేతితో వంచిన కుడికాలును పట్టుకొని ఉందన్నారు. మరొక స్త్రీ కొంచెం వంగి తన రెండు చేతులతో శృంగార స్త్రీకి బాహ్య మద్దతు ఇస్తున్నట్లుగా శిల్పులు ఆద్యంతం శృంగారవంతంగా చిత్రీకరించారని తెలిపారు. ఈ స్త్రీ,పురుష సంభోగం కడు విచిత్రంగా ఉందని రచయిత వెల్లడించారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది : మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 1 :** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేం దుకు చేపట్టిన పలు కార్యక్రమాల్లో భాగంగా, ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీతాశ్రం వద్ద సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ హిందీ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం విశేష ఫలితాలను సాధించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్థాపించి నడుపుతున్న సంస్కృతి స్వచ్ఛంద సంస్థ అకాడమీ ద్వారా శిక్షణ పొందిన 400 మందిలో, తాజాగా జరిగిన మెగా డీఎస్సీ పరీక్షల్లో 207 మంది అభ్యర్థులు పాఠశాల సహాయకులు, PGT, TGT ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణం. అంతేకాక, దాదాపు 20 మంది అభ్యర్థులు 80 మార్కుల కుపైగా రాణించి, తమ ప్రతిభను నిరూపించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ విజేతలతో ఫోన్ ద్వారా మాట్లాడి వారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, అన్ని వృత్తులలో పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి. సమాజ అభివృద్ధికి, భవిష్యత్ తరాల తీరికకు ఉపాధ్యా యుల పాత్ర అత్యంత కీలకం. పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే నిజమైన సేవ. మీరు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలి. అని శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో సంస్కృతి సేవా సమితి ద్వారా శిక్షణ అందించడంలో, విద్యార్థులకు ఉన్నతమైన మార్గదర్శకత్వం కల్పించడంలో కీలక పాత్ర పోషించిన కె.సురేష్ కృషిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ప్రోత్సాహం, కృషి కారణంగా విద్యార్థులు ఇంతటి విజయం సాధించగలిగారని మంత్రి అన్నారు. తాజా ఫలితాలతో ఉత్సాహం పొందిన సంస్కృతి సేవా సమితి భవిష్య త్తులో మరింత మంది విద్యార్థులకు డీఎస్సీ, పాఠశాల ఉపాధ్యా యుల శిక్షణను విస్తృతంగా అందించాలని నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి కుటుం బాలకు చెందిన ప్రతిభా వంతులైన విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో మరింత అవకాశాలను పొందగలరని మంత్రి సత్యకుమార్ యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రతిభకు పట్టాభిషేకం... మామిడాల శ్రీనివాసరావు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖ సెప్టెంబర్ 1 :** ప్రతిభావంతుల పట్టాభిషేకం 2025 గాను ప్రతిభ క్రీడా మరియు సాంస్కృతిక సంస్థ 25 వ వార్షికోత్సవాలు విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుండి వివిధ విభాగాలలో ప్రతిభావంతులైన 31 మందికి ప్రతిభా క్రీడా సాంస్కృతిక సంస్థ మరియు ఎస్ఎస్ఎల్ క్రియేషన్స్ అధినేత కంచర్ల అచ్యుతరావు మరియు ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన అవార్డు గ్రహీతలకు దాడి సత్యనారాయణ మాజీ డిప్యూటీ మేయర్ చేతుల మీదుగా అవార్డుల ప్రధాన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ముందుగా కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం పలువురు వక్తలు మాట్లాడగా హర్షద్వానాల మధ్య అవార్డు గ్రహీతలకు ఘనంగా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. జవహర్లాల్ నెహ్రూ జాతీయ సేవారత్న అవార్డు సమాజ సేవకులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత, పెదన పట్టణ ఆర్యవైశ్య సేవా సంఘం అఖిలభారత ఆర్యవైశ్య పరిరక్షణ సమితి డాక్టర్ కొల్లూరు సత్యనారాయణ. ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ సేవ రత్న అవార్డును, గుంటూరు కి చెందిన సీనియర్ జర్నలిస్టు మామిడాల శ్రీనివాసరావు తదితరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బైపల్లి సోమేశ్వరరావు, విజయ రమణి, దుర్గాప్రసాద్, సుబ్రహ్మణ్యం, బిశెట్టి అన్నపూర్ణ, రాయప్ప, శాస్త్రి, జబర్దస్త్ ప్రకాష్, సన్ మూర్తి. భాస్కరరావు, ఉమ్మడి మహేశ్వరరావు, హేమ మసుందర్రావు, సంతోష్ కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాఫీ ప్రోసెసింగ్ యూనిట్‌ను చింతపల్లిలో ఏర్పాటు చేయాలి

● కాఫీ మార్క్స్ డైరెక్టర్ అడపా విష్ణుమూర్తి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 1:**గిరిజన రైతుల ప్రధాన ఆదాయ వనరు అయిన కాఫీ పంట ప్రాసెసింగ్ కోసం గత ప్రభుత్వ హయాంలో చింతపల్లిని కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కాఫీ ప్రోసెసింగ్ యూనిట్‌ను ప్రస్తుత ప్రభుత్వం నర్సీపట్నం మండలంలోని చెట్టిపాలెంకు తరలించడంపై గిరిజన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి కాఫీ మార్క్స్ డైరెక్టర్ అడపా విష్ణుమూర్తి మాట్లాడుతూ, "ఈ యూనిట్‌ను గిరిజన ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలని ఎప్పటి నుండో ఉద్యమం సాగుతోంది. గత ప్రభుత్వం 5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి, అప్పటి ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చేతుల మీదుగా డౌనూరు వద్ద భూమిని కేటాయించి శంకుస్థాపన కూడా జరిగింది. కానీ ప్రభుత్వం మారిన తరువాత 2025 ఆగస్టు 9న నర్సీపట్నంలో యూనిట్‌ను ప్రకటించటం బాధాకరం," అని పేర్కొన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉండటం వలన మైదాన ప్రాంతానికి తరలించి యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెబుతుండటం గిరిజన రైతులను మోసగించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. "జీసీసీ (గిరిజన సహకార సంస్థ) 5.5% తేమ శాతం ఉన్న కాఫీ మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తోంది. రైతులు ఇంటి వద్దే ఆరబెట్టిన కాఫీని అమ్ముతున్నారు. ప్రత్యేకంగా జీసీసీ కోసం ఆరబెట్టాల్సిన అవసరం లేదు," అని అన్నారు. అంతేకాక, గతంలో ప్రారంభించిన 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల చింతపల్లి డైలీ ఫారంల వద్ద ఉన్న గోడౌన్, గూడెం కొత్త వీధి, జి మాడుగుల ప్రాంతాల్లోగల ఎకో పల్పింగ్ యూనిట్లు సగం వరకు నిర్మాణం పూర్తయిన వుండగా, వాటిని పూర్తిచేసి రైతుల కోసం అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరంలో జీసీసీ సంస్థ తక్కువ ప్రాంతాల నుంచి మాత్రమే ఆర్గానిక్ కాఫీని 330 రూపాయలకు కొనుగోలు చేసి, మిగతా గిరిజన రైతుల వద్ద కేవలం రూ.250కే తీసుకున్నదని చెప్పారు. ఇదే కాఫీ అయినప్పటికీ ధరలో ఈ తేడా అన్యాయం అని అన్నారు. "గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటయ్యే ప్రాసెసింగ్ యూనిట్లు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను చింతపల్లిలోనే కొనసాగించాలని, ఇప్పటికే మంజూరైన నిధుల ద్వారా పూర్తిచేయాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి," అని అడపా విష్ణుమూర్తి గారు విజ్ఞప్తి చేశారు.

# 2014-19 మధ్య తాను మంత్రిగా ఉన్నప్పు డు 100 ఎకరాలు గుర్తించామని

● మహిళ ఎస్.ఈ.జెడ్.కు భూమిని గుర్తించండి
● ఏపీఐఐసీ అధికారులను ఆదేశించిన గంటా



**భిమిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 01 :**మహిళ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్.ఈ.జెడ్) కోసం భీమిలి నియోజకవర్గంలో 50 ఎకరాల భూమిని గుర్తించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఏపీఐఐసీ అధికారుల తో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ప్రత్యేక ఎస్.ఈ.జెడ్. కావాలని మహిళా పారి శ్రామికవేత్తలు ఎప్పటినుంచో కోరుతున్నారన్నారు. 2014-19 మధ్య తాను మంత్రిగా ఉన్నప్పు డు 100 ఎకరాలు గుర్తించామని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించిందని చెప్పారు. ఓజోన్ వ్యాలీ, బావి కొండ ప్రాంతాల్లో 25 ఎకరాల నుంచి 50 ఎకరా లు అందుబాటులో ఉన్నాయని ఏపీఐఐసీ అధికారులు గంటాకు తెలియజేశారు. కణమాం లో ఎస్.ఈ.జెడ్.కు అవసరమైన భూమి అందు బాటులో ఉందన్నారు. అలాగే కొత్తగా ఏర్పాటు కాబోతున్న ఐటీ కంపెనీలకు ఇచ్చిన భూముల సమాచారాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. భీమి లి నియోజకవర్గంలో ఏపీఐఐసీ సేకరించిన, సేకరిస్తున్న భూముల గురించి తెలిపారు. ప్రభు త్వ విధానాల మేరకు ఐటీ, ఇతర పరిశ్రమల అవసరాలకు భూములను సేకరించి సిద్ధంగా ఉంచాలని గంటా శ్రీనివాసరావు సూచించారు. జోనల్ మేనేజర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# రాజ్మా చిక్కుల పంపిణీ లో ప్రోటోకాల్ పాటించాలి:

● వైసిపి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ డిమాండ్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, సెప్టెంబర్ 1:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో జరుగుతున్న రాజ్మా చిక్కుల పంపిణీపై అధికారుల ప్రవర్తనలో ప్రోటోకాల్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడిన ఆయన, "రాజ్మా చిక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నాయకుల సమక్షంలోనే చేయాలన్న విధంగా చెప్పడం సరికాదు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. గ్రామ స్థాయి నుండి వైసీపీ క్యాడర్ బలంగా ఉంది. మా పార్టీకి పనిచేస్తున్న ఎన్నో స్థాయిల నాయకులు ఉన్నారు. ఈ విషయాన్ని కూటమి నాయకులు గమనించాలి," అని స్పష్టం చేశారు. అధికారులు ప్రోటోకాల్ ను పాటించకపోతే, జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రజల చేత ఎన్నికైన ఎంపి,ఎమ్మెల్యే, ఎంపీపీ,జడ్పీటీసీ,సర్పంచ్, ఎంపీటీసీ,వార్డ్ మెంబెర్స్, సమక్షంలో పంపిణీ జరగాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, వైసీపీ సీనియర్ నాయకులు కంకిపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# "అయ్యప్పస్వామి"ఆలయ నిర్మాణానికి ప్రసాద్ భరోసా

## ఆలయ నిర్మాణ విషయమై ప్రసాద్ ని కలిసిన అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్1:** మల్లెపూల చదును ప్రాంతంలో చేపట్టనున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందచేస్తానని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ భరోసా ఇచ్చారు. మండల కేంద్రం కొయ్యూరులో ప్రసిద్ధిగాంచిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో గల ప్రాచీనమైన మల్లెపూల చదును ప్రాంతంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి మల్లికార్జున స్వామి ఆలయ అర్చకులు నాగసాయి శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు సంకల్పించారు. దీనితో ఆలయ నిర్మాణానికి సలహా సూచనలతో పాటు పెద్దల సహాయ సహకారాలు కోరుతూ విషయాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్, మల్లికార్జున స్వామి ఆలయ ధర్మకర్త ఎంవివి ప్రసాద్, స్థానిక సర్పంచ్ మాకాడ బాలరాజుల దృష్టికి తీసుకు వెళ్తూ ఆలయ నిర్మాణ వివరాలను వారికి వివరించేందుకు సభ్యులంతా మర్యాదపూర్వకంగా వారిని కలిశారు. ఈ సందర్భంగా సేవా సంఘం సభ్యులు ఆలయ నిర్మాణ ప్రణాళికలను వివరిస్తూ ఎంతో ప్రాచుర్యం గల అటవీ ప్రాంతంలో ఉన్న మల్లెపూల చదును ప్రాంతం కేరళ శబరిమల గిరుల వాతావరణాన్ని పోలి ఉండడంతో ఈ ప్రాంతంలో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించాలని సంకల్పించినట్లు తెలిపారు. ఆలయ గర్భగుడి, మండపం, గోపురం, అన్న ప్రసాద భవనం వంటి వివిధ సౌకర్యాలతో నిర్మించబోయే ఆలయానికి సుమారు రెండున్నర కోట్ల మేర అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు. అలాగే నిర్మించబోయే ఆలయానికి చేరుకునేందుకు వీలుగా సుమారు మూడు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం గుండా రహదారి నిర్మాణం విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు త్రాగునీరు వంటి ప్రధాన అంశాలపై వారితో చర్చించారు. ఆలయ నిర్మాణ విషయమై స్పందించిన ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ యోచన అభినందనీయమన్నారు. ఈ విషయమై తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందించడంతోపాటు రహదారి నిర్మాణం విద్యుత్ సదుపాయం తదితర విషయాల ఆవశ్యకతను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# పాలనా సంస్కరణలకు ఆధ్యుడు చంద్రన్న

టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర



**అరకులోయ పెన్ పవర్ 1** :ఆంధ్రప్రదేశ్ లో పాలన సంస్కరణలకు ఆధ్యుడు గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని తెలుగువారికి ఐటిని పరిచయం చేసిన మేధావని తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికీ 30 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా మూడు దశాబ్దాల కాలంలో నాలుగు సార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు నాయుడు పాలనలో తెచ్చిన సంస్కరణలపై ఆయన సోమవారం అరకులో విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ లో ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చారని ఈరోజు దాన్ని పి4గా అమలు చేస్తున్నారన్నారు. ప్రజా చైతన్యంతో రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బాలిక విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ మహిళలకు దీపం పథకం అమలు చేసిన తొలి వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎస్సీల రక్షణ కోసం పున్నయ్య కమిషన్ సూచనలు అమలు చేశారని బీసీలకు మహిళలకు స్థానిక సంస్థలు రిజర్వేషన్లు కల్పించాలని చెప్పారు. మైనార్టీలకు సంక్షేమం, భద్రతను కల్పించారన్నారు. వారికి ప్రత్యేకంగా పథకాలు అందించారని చెప్పారు. తొలిసారిగా డ్వాక్రా మహిళ సంఘాల ఏర్పాటు చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు. సంస్కరణలు అమలు చేసిన వ్యక్తి దాని ద్వారా అద్భుతమైన ఫలితాలు రాబట్టిన వ్యక్తి కూడా చంద్రన్నేనని తెలిపారు. ప్రతి గ్రామంలో పిపిపి విధానంలో నేషనల్ హైవేకు అంకురార్పణ చేస్తూ గ్రామ గ్రామాన రహదారుల నిర్మాణానికి చంద్రన్న శ్రీకారం చుట్టారన్నారు. ఐటీ కి ప్రాధాన్యమిస్తూ హైటెక్ సిటీ నిర్మాణానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కళాశాల నిర్మించారని ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారన్నారు. విజన్ 2020తో పాలనకు కొత్త రూపు తీసుకొచ్చిందని చెప్పారు. విద్యా రంగంలోని నూతన మార్పులకు శ్రీకారం చుట్టారని అందులో భాగంగానే 1.80 లక్షల టీచర్లు నియమించి నాలెడ్జ్ అకాడమీకి నాంది పలికారన్నారు. దేవాలయాలను పరిరక్షిస్తూ స్థానిక టూరిజానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన వ్యక్తి చంద్రబాబు నాయుడున్న విషయాన్ని గుర్తు చేశారు. డిజిటల్ గవర్నెన్స్ తో సేవలను మరింత సులభతరం చేశారని డిజిటల్ కరెన్సీ కమిటీకి చంద్రబాబు నాయుడు నేతృత్వం వహించారన్నారు. స్వచ్ఛభారత్ కమిటీకి కూడా నేతృత్వం వహించి ఈరోజు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లను తీసుకొచ్చారన్నారు. దేశంలోనే తొలిసారిగా ఇజ్రాయిల్ నుంచి డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీని ఆంధ్ర ప్రదేశ్ కు పరిచయం చేసిన వ్యక్తి చంద్రన్న అన్నారు. అన్నదాతకి అండగా నిలవాలని ఉద్దేశంతో నదులను అనుసంధానం చేయడంలో చంద్రబాబు విజయం సాధించారని అట్టడుగున ఉన్న దళితుల కోసం ఎస్సీ వర్గీకరణ అమలు చేసినటువంటి వ్యక్తి మన ముఖ్యమంత్రి అన్నారు. రియల్ టైం గవర్నెన్స్ పారదర్శక పాలన తీసుకొచ్చిన వ్యక్తి రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి శ్రీకరం చుట్టి మధ్యలో ఆగిపోయిన మళ్లీ దాని నిర్మాణం కోసం ఇప్పుడు సాయి శక్తుల కృషి చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గూగుల్ లో కొట్టుకొని కాపీ చేసి తీసుకురా అరకు వ్యాలీ మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, డుంబ్రిగూడ మండలం అధ్యక్షుడు కిల్లో ఆనంద్ రావు, హుకుంపేట మండలం అధ్యక్షుడు శతక బొంజు బాబు, పెదబయలు మండల అధ్యక్షుడు వెచ్చంగి కొండయ్య, మాజీ అధ్యక్షుడు శెట్టి బాబురావు, కోపరేట్ చైర్మన్ పాంగి సుబ్బారావు, సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, ప్రధాన కార్యదర్శి పాంగి రాజు, మాజీ సర్పంచ్ కొర్ర ఓనాది, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బోండా వినోద్, మాడగడ పంచాయతీ అధ్యక్షుడు కొర్ర సుబ్బారావు, పెదలబుడు పంచాయితీ అధ్యక్షుడు బోయి దామోదర్, పాతకోట పంచాయతీ అధ్యక్షుడు కొర్ర నరసింగరావు, క్లస్టర్ ఇన్చార్జి కూడేల్ నూకరాజు, క్లస్టర్ ఇన్చార్జి కొర్ర నాగరాజు, టిడిపి సర్పంచ్ లు ఎంపీటీసీలు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో గూగుల్ డేటా సెంటర్ గేమ్‌చేంజర్ కానుంది





భిమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**భిమిలి పెన్ పవర్, సెప్టెంబర్ 1 :**కొత్త తరాన్ని రాజకీయాల్లోకి తీసుకువచ్చి నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందని, తానే కూడా ఆయన శిష్యుడినని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎం.వి.పి కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో సోమవా రం మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. చంద్రబాబు విద్యార్థి సంఘం నాయకుడి నుంచి ప్రజాప్రతినిధి, ఆపై ముఖ్యమంత్రి స్థా యికి చేరుకోవడం ప్రేరణాత్మకమని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు సార్లు, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రెండు సార్లు మొత్తం 5,442 రోజులపాటు ముఖ్యమంత్రిగా సేవలందించి రికార్డు సృష్టించారని గుర్తుచేశారు. హైదరా బాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకురావడం ఐటీ రంగా నికి గేమ్‌చేంజర్ అయినట్లే, విశాఖలో 6 బిలి యన్ డాలర్లతో ఏర్పడబోయే గూగుల్ డేటా సెంటర్ కూడా భవిష్యత్‌లో అటువంటి గేమ్‌చేం జర్ అవుతుందని గంటా అభిప్రాయపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్, శంషాబాద్ విమానాశ్రయం, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులు చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. రూ.500గా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6,000కి పెంచింది చంద్రబాబేనని ఆయన గుర్తు చేశారు. సంక్షేమాన్ని మాత్రమే కాదు, పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్ర సంపదను పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. విశాఖకు టీసీఎస్, అదానీ డేటా సెంటర్, కాగ్నిజెంట్, సత్వా, సిఫీ వంటి కంపెనీలు రావడంలో చంద్రబాబు పాత్ర కీలకమని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి సభలకు జనం రాకపోవడంతో గ్రాఫిక్స్ జిమ్మిక్కులు చేస్తున్నా రని గంటా ఎద్దేవా చేశారు. మునిగిపోతున్న వైసీపీ నాయకులు జనసేన, బీజేపీ వైపు వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. "ముఖ్యమం త్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు" పూర్తి అయిన సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించి, కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, పిల్లా మంగమ్మ, మొల్లి హేమలతతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా భారీ అన్న సమారాధన



**గాజువాక పెన్ పవర్, సెప్టెంబర్ 01:** నాతయ్యపాలెం గ్రామం, ఎరుకులమ్మ విధిలో ఫ్రెండ్లీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన భారీ అన్నసమారాధన కార్యక్రమనికి 69 వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యి కార్యక్రమం ప్రారంభించారు. అలానే 69 వార్డు జనసేన అధ్యక్షుడు సంద్రాన భాస్కర్ కూడా హాజరయ్యారు. వీరితో పాటు నాతయ్యపాలెం గ్రామ పెద్దలు. సంద్రాన వరహాల రాజు , గొల్లవిల్లి నరసింఘ రావు పాల్గొన్నారు.
తమ ఆహ్వానం మన్నించి కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు ఫ్రెండ్లీ యూత్ కమిటీ సభ్యులు అయినటువంటి రాజా ,బాబ్జీ ,వెంకట రమణ ,విజయ్ , తదితరులు కృతజ్ఞ్యతులు తెలియజేశారు.

# తాను చనిపోయానంటూ వార్తలపై స్పందించిన ట్రంప్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న వదంతులకు స్వయంగా ముగింపు పలికారు. ఇటీవల చ%ఠతీబఎజూ×ంణఋ్ఱం% అనే హ్యాష్‌ట్యాగ్ ఎక్స్ లో ట్రెండ్ కావడంతో ఆయన ఆరోగ్యంపై అనేక అనుమానాలు రేకెత్తాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో స్పందిస్తూ, తాను తన జీవితంలో ఎన్నడూ లేనంత ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

**వదంతులకు కారణాలు**

ఈ పుకార్లు రావడానికి ప్రధాన కారణం గత వారం వైట్‌హౌస్ విడుదల చేసిన ట్రంప్ ఖాళీ షెడ్యూల్. ఇది ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. అయితే దీనిని ఖండిస్తూ ట్రంప్ శనివారం గోల్ఫ్ ఆడుతున్న ఒక ఫోటోను పంచుకున్నారు. కానీ, కొందరు నెటిజన్లు ఆ ఫోటో కూడా డిజిటల్‌గా మార్పులు చేసిందని ఆరోపించారు.

**రాజకీయ నాయకుల స్పందన**

ట్రంప్ మరణంపై వస్తున్న వదంతులపై పలువురు రాజకీయ నాయకులు స్పందించారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విషయంపై మాట్లాడుతూ ట్రంప్ 79 ఏళ్ల వయసులో కూడా చాలా ఆరోగ్యంగా ఉన్నారని, ఆయన నిత్యం చురుకుగా కార్యకలాపాల్లో పాల్గొంటారని తెలిపారు.

అలాగే, కన్సర్వేటివ్ వ్యాఖ్యాత డీసీ డ్రైనో మీడియాపై మండిపడ్డారు. బైడెన్ చాలా రోజులు కనిపించకపోయినా, ఆయన గురించి మీడియా సానుకూలంగా రాస్తుందని, కానీ ట్రంప్ ఒక్కరోజు కనిపించకపోతేనే ఆరోగ్యంపై పుకార్లు సృష్టిస్తున్నారని విమర్శించారు.

**వదంతులకు ముగింపు**

మొత్తంగా, "ట్రంప్ మృతి" అనే హ్యాష్‌ట్యాగ్ అమెరికా రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, ట్రంప్ స్వయంగా స్పష్టత ఇవ్వడంతో ఈ పుకార్లకు తాత్కాలికంగా ముగింపు పడింది. రాజకీయ నాయకుల మధ్య ఆరోగ్య సమస్యలపై వదంతులు వ్యాప్తి చెందడం అమెరికాలో సాధారణంగా జరిగే విషయం. అయినప్పటికీ, ఈసారి ఈ వదంతులు అత్యంత వేగంగా విస్తరించాయి.

# జాబ్ ఇంటర్వ్యూకు వెళుతున్నారా? బిల్ గేట్స్ తాజా టిప్స్ తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారా? అక్కడ ఎదురయ్యే ప్రశ్నలకు ఎలాంటి సమాధానాలు చెప్పాలన్న దానిపై టెన్షన్ ఉంటుంది. ఏ ప్రశ్నకు ఎలాంటి సమాధానం చెబితే ఏమవుతుందన్న సందేహం ఉంటుంది. ఐటీ ఉద్యోగాన్ని సొంతం చేసుకోవటానికి వీలుగా పలు రౌండ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంతా ఓకే అయి.. చివరి రౌండ్ లో ఎదురయ్యే కొన్ని ప్రశ్నల విషయంలో ఏం చెబితే ఏమవుతుందో అన్న ఆందోళన ఉంటుంది. మరి.. ముఖ్యంగా జీతం ఎంత కావాలన్న దానిపై ఏం చెప్పాలన్న సందేహం పలువురిని వెంటాడుతుంటుంది. ఈ తరహా సందేహాలపై దిగ్గజ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తాజాగా కొన్ని సలహాలు..సూచనలు ఇచ్చారు. ఆయన చెప్పిన మాటల్ని శ్రద్ధగా వినటమే కాదు.. ఆచరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పాలి. ప్రతి ఇంటర్వ్యూలో వచ్చే సాధారణమైన ఒక ప్రశ్న.. అత్యంత కష్టంగా..క్లిష్టంగా ఉంటుంది. అదే.. ఈ ఉద్యోగానికి మిమ్మల్నే ఎందుకు ఎంచుకోవాలి? అని. దీనికి ఎలాంటి సమాధానం చెప్పాలన్న దానిపై బిల్ గేట్స్ చేస్తున్న సూచన ఏమంటే.

చదువుకునే సమయంలో నేర్చుకున్న దాని కంటే ఎక్కువగా సాఫ్ట్ వేర్ ప్రోగ్రామ్ లను రాయగలనని.. కోడింగ్ చేయగలనన్న విషయాన్ని ఆత్మవిశ్వాసంతో చెప్పాలన్న సూచన చేశారు. అంతేకాదు.. కొత్తవారితో సులువుగా కలిసిపోతానని.. టీం వర్కును ఇష్టపడతానన్న విషయాన్ని అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఐటీ జాబ్ చేయాలన్నది తన కల అన్న విషయాన్ని చెప్పటంతో పాటు.. రోజు రోజుకు సబ్జెక్టు విషయంలో ఎంత బెటర్ అయ్యామనే విషయాన్ని మన పనితో చూపించాలని చెప్పారు.

బలాలు.. బలహీనతల గురించి చెప్పాలని అడిగినప్పుడు తెలియని విషయాల్ని తెలియదని నిజాయితీగా చెప్పాలని సూచన చేశారు. అదే సమయంలో ఎలాంటి ఉద్యోగాన్ని సమర్థంగా.. ఇష్టంగా చేయగలమన్న విషయాన్ని తెలియజేయాలన్న ఆయన.. ఒక ఉదాహరణగా తన గురించి చెప్పుకొచ్చారు. తనకు మార్కెటింగ్ విభాగంలో పని చేయటం ఇష్టం లేదని.. అందులో తాను కమిట్ మెంట్ తో పని చేయలేనని చెప్పారు. ఇంటర్వ్యూలో భాగంగా అడిగే మరో కీలకమైన ప్రశ్న.. ఎంత జీతం కావాలి? శాలరీ అంచనాలు ఏమిటి? అని అడిగినప్పుడు ఏం చేయాలన్న దానిపై బిల్ గేట్స్ కీలక సూచనలు చేశారు. శాలరీ అంచనాల గురించి అడిగితే.. వెంటనే వచ్చే డబ్బుల కంటే స్టాక్స్ ఆప్షన్స్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని.. ఆ అంశాన్ని ప్రస్తావించాలని చెప్పారు. ఈ తరహాలో మాట్లాడటం ద్వారా ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఉద్యోగంలో ఎలాంటి రిస్కు అయినా తీసుకోవచ్చు కాబట్టి.. సంస్థ ఇచ్చే శాలరీలో భాగంగా స్టాక్స్ ఇవ్వాలని అడగాలని చెప్పారు. ఇలా అడగటం ద్వారా.. ఇంటర్వ్యూ చేసే వారికి స్టాక్స్ అడగటం ద్వారా సంస్థ ఫ్యూచర్ మీద ఉన్న నమ్మకం.. ఉద్యోగంలో రాణించాలన్న అంశం అర్థమవుతుందని చెప్పారు. మొత్తంగా ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి బిల్ గేట్స్ ఇచ్చిన సూచనలు ఎంతో మేలు చేస్తాయని చెప్పక తప్పదు.

# ఐదు రోజుల్లో మాజీ మంత్రి రోజా అరెస్టు?



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి, వైసీపీ అధికార ప్రతినిధి ఆర్కే రోజాను ఈ వారంలో అరెస్టు చేసే అవకాశం ఉందా? శాప్ చైర్మన్ రవినాయుడు చెబుతున్న ప్రకారం రోజాను మరో ఐదు రోజుల్లోనే అరెస్టు చేస్తారని అంటున్నారు. అయితే శాప్ చైర్మన్ చెప్పినట్లు రోజా అరెస్టు జరుగుతుందా? లేదా? అన్నదే ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆడుదాం ఆంధ్రా స్కాంలో ప్రజా ధనం దుర్వినియోగమైనట్లు ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత ప్రభుత్వంలో రోజా క్రీడా మంత్రిగా ఉండగా, రూ.119 కోట్లతో ఆడుదాం ఆంధ్రా పేరుతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడాపోటీలు నిర్వహించారు. అయితే ఈ పోటీల పేరుతో రోజా ప్రోత్సాహంతో రూ.40 కోట్ల మేర అవినీతి జరిగిందని ప్రభుత్వం, టీడీపీ నేతలు ఫిర్యాదు చేస్తున్నారు. అంతేకాకుండా శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ కబడ్డీ క్రీడాకారుడు ఆర్డీ ప్రసాద్ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఇక ఈ స్కాంపై రవినాయుడు ఫిర్యాదుతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆడుదాం ఆంధ్ర స్కాంపై విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు గత నెలలోనే డీజీపీకి నివేదిక అందజేశారు. క్రీడా పరికరాల కొనుగోలు, క్రీడాకారులకు వసతి పేరుతో దాదాపు రూ.40 కోట్ల మేర అక్రమాలు జరిగాయని విజిలెన్స్ తన నివేదికలో పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ అవినీతి వ్యవహారంలో మాజీ మంత్రి రోజా ప్రమేయంపై కీలక ఆధారాలను విజిలెన్స్ సమర్పించినట్లు చెబుతున్నారు. దీంతో త్వరలో రోజాను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అయితే మహిళా నేతను అయిన తనను అరెస్టు చేసే సాహసం ప్రభుత్వం చేయదని రోజా ధీమా వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు.కాగా, రోజా అవినీతి వ్యవహారంపై విజిలెన్స్ స్పష్టమైన ఆధారాలు సేకరించినందున ఆమెను ఎట్టి పరిస్థితుల్లోనూ అరెస్టు చేస్తామని శాప్ చైర్మన్ రవినాయుడు స్పష్టం చేస్తున్నారు. రోజాతోపాటు నాటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డిని కూడా అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ వారంలోనే అరెస్టులు అంటూ జరుగుతున్న ప్రచారం రాష్ట్ర రాజకీయాన్ని వేడెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పలు రకాల కేసుల్లో వైసీపీ నేతలు, కార్యకర్తల అరెస్టు జరుగుతోంది. అయితే మాజీ మంత్రి రోజా అరెస్టుపై టీడీపీ, జనసేన కార్యకర్తల నుంచి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందని అంటున్నారు.

గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని టీడీపీ శ్రేణులు కారాలు మిరియాలు నూరుతున్నాయి. ఇలా అప్పట్లో నోరు పారేసుకున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, సినీ నటుడు పోసాని క్రిష్ణమురళి, వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇదేవిధమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రులు కొడాలి నాని, రోజాలను అరెస్టు చేయాలని ఎప్పటి నుంచో పావులు కదుపుతోందని అంటున్నారు. అయితే అనారోగ్య కారణాల వల్ల కొడాలి పేరును కాస్త వెనక్కి పెట్టి, ముందు రోజాకు అరదండాలు వేసే దిశగా ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని అంటున్నారు. అయితే విజిలెన్స్ నివేదికను ఆధారంగా చేసుకుని ఏసీబీ కేసు నమోదు చేసి అరెస్టు చేస్తారా? లేక సీఐడీ ద్వారా అరెస్టుకు చర్యలు తీసుకుంటారా? అనేది చర్చకు తావిస్తోంది. ఇదే సమయంలో రోజాను అరెస్టు చేయాలంటే ముందుగా గవర్నర్ అనుమతి తీసుకోవాల్సివుంటుంది. గవర్నర్ అనుమతి లేనిదే మాజీ మంత్రిని అరెస్టు చేసే అవకాశాలు లేనందున ప్రభుత్వ నిర్ణయం కొన్నాళ్లు ఆలస్యమయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని అంటున్నారు.

# హరీశ్, సంతోష్ తోనే కేసీఆర్ కు చెడ్డపేరు..కవిత సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత... అమెరికా నుంచి తిరిగి వస్తూనే సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఉదయం విమానాశ్రయంలో దిగిన కవిత... సాయంత్రానికి ప్రెస్ మీట్ పెట్టారు. తన తండ్రి కేసీఆర్ ను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ లోని కొందరు అవినీతికి పాల్పడ్డారని, ఆయనకు చెడ్డపేరు తెచ్చారని మండిపడ్డారు. చిన్న కుమారుడి పైచదువుల కోసం గత నెలలో అమెరికా వెళ్లిన కవిత తిరిగొచ్చిన తర్వాత వెంటనే బీఆర్ఎస్ నాయకులపై విమర్శలకు దిగడం గమనార్హం. హైదరాబాద్ లో సోమవారం ఆమె ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడారు.

**వారితోకే కేసీఆర్ కు అవినీతి మరక**

తన తండ్రి కేసీఆర్ పక్కనున్న కొందరు ఆయన పేరు చెప్పుకొని అనేక చెడ్డపనులు చేశారని అన్నారు. అనేక రకాలుగా లబ్ధి పొందారని, అనేక చెత్త పనులు చేశారని వారి కారణంగానే నేడు బద్నాం అయ్యే పరిస్థితి వచ్చిందని కవిత ఆరోపించారు. వీరందరి కారణంగానే కేసీఆర్ కు అవినీతి మరక అంటిందన్నారు. ఇది ఎందుకోసం వస్తుందో ఆలోచన చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఇందులో మాజీ మంత్రి హరీశ్ రావు పాత్ర లేదా? అని ప్రశ్నించారు. హరీశ్ ఐదేళ్ల పాటు సాగునీటి మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. మాజీ ఎంపీ సంతోష్ పేరు చెప్పకుండానే మాజీ ఎంపీ అని ప్రస్తావిస్తూ, వీరితో పాటు మేఘా ఇంజినీరింగ్ క్రిష్ణారెడ్డి పేరునూ బయటకు తెచ్చారు. కాళేశ్వరంలో కుంగింది చిన్న భాగమేనని, మొత్తం ప్రాజెక్టు పోయినట్లు రాద్ధాంతం చేస్తున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారు..**

కేసీఆర్ ప్రజల కోసం పనిచేశారని... కానీ, ఆయన పక్కనున్న వారు ఆస్తులు పెంచుకోవడానికి పనిచేశారని కవిత ఆరోపించారు. హరీశ్ కు కేసీఆర్ రెండోసారి సాగునీటి మంత్రి పదవి ఇవ్వనిది అందుకేనని అన్నారు. హరీశ్, సంతోష్ తనపై ఎన్నోసార్లు కుట్రలు చేశారని.. అన్నింటినీ తాను భరించానని వివరించారు. తన లేఖ బయటకు వచ్చినప్పుడూ తాను మాట్లాడలేదన్నారు. ఇప్పుడు కేసీఆర్ పేరు బద్నాం అవుతుండడంతతో తాను ఆయన బిడ్డగా తాను బాధపడుతున్నట్లు తెలిపారు.

**హరీశ్, సంతోష్ వెనుక రేవంత్...!**

హరీశ్ రావు, సంతోష్ వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, వారి మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని కవిత ఆరోపించారు. అందుకే వారిద్దరినీ రేవంత్ ఏమీ అనడం లేదని పేర్కొన్నారు. కేసీఆర్ నే టార్గెట్ చేస్తారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక ఇక బీఆర్ఎస్ ఉంటే ఎంత? లేకపోతే ఏంటి? అని ప్రశ్నించారు. ఇది తన తండ్రి పరువుకు సంబంధించిన విషయం అని అన్నారు. కేసీఆర్ కాలిగోటికి సరిపోని, తెలంగాణ ఉద్యమంతో ఏమాత్రం సంబంధం లేని రేవంత్ రెడ్డి ఆయన మీదనే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించారంటే దానికి కారణం మీరు కాదా? అని హరీశ్, సంతోష్ లను కవిత నిలదీశారు. ఈ వయసులో కేసీఆర్ కు ఇలాంటి పరిస్థితి ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా వారినే మోస్తాం.. వారినే ముందుకు తీసుకెళ్తాం అంటే పార్టీ ఎట్లా మనుగడ సాధిస్తుందని వ్యాఖ్యానించారు.

# మరో వర్షాల నెల.. సెప్టెంబరులోనూ భారీగా!



**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ నెల వచ్చిందంటే వర్షాలకు కేరాఫ్ అడ్రస్ అనుకోవటం మామూలే. సాధారణంగా జూన్ లో మొదలయ్యే వర్షాలు జులైలో మరింత పెరిగి.. ఆగస్టు వచ్చే నాటికి ముగింపు దశకు చేరుకోవటం చూస్తుంటాం. అయితే.. ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న పరిస్థితి. ఈసారి మేలోనే వర్షాలు పలుకరించటం.. మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరి ఖాయమని డిసైడ్ అయిన వేళ..వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు.. ముందే కురిసిన వర్షాలతో మండాల్సిన మే కాస్తా కూల్ గా మారిపోవటంతో.. చాలా మంది హ్యాపీగా ఫీల్ అయ్యారు. అయితే.. ఆ సంతోషం ఎక్కువ కాలం సాగలేదు. మేలో మండే ఎండలకు బదులుగా వర్షాలతో చల్లబడిన దానికి బదులుగా వర్షాలతో ముంచెత్తాల్సిన జూన్ ఎండలు దంచి కొట్టాయి. దీంతో.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. జూన్ మూడో వారం నుంచి వర్షాలు మొదలు కావటం.. జులైలో కురిసిన ఆకస్మిక వర్షాలు అప్పటివరకు ఉన్న వర్షాభావ పరిస్థితిని మార్చేశాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏపీతో పోలిస్తే తెలంగాణ పెద్ద ఎత్తున వర్షాలు కురవటం.. గడిచిన సంవత్సరాల సరాసరిని దాటేయటం కనిపించింది.

గత నెల (జులై) చివరి వారాల్లో కురిసిన భారీ వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్ని తీవ్రంగా నష్టపోయేలా చేసింది. ఇదిలా ఉండగా..ఈ రోజుతో ప్రారంభమవుతున్న సెప్టెంబరు నెలలో వర్షాలు ఏ రీతిలో ఉండనున్నాయి? అన్నది ఆసక్తికరంగా మారింది. దీనికి సంబంధించి భారత వాతావరణ విభాగం కీలక వివరాల్ని వెల్లడించింది. అదేమంటే సాధారణంగా సెప్టెంబరులో కురిసే వర్షాలకు మించి 109 శాతం అధికంగా వర్షాలు కురిసే వీలు ఉందని చెప్పాలి.

ఈ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు.. కొండచరియలు విరిగి పడి జనజీవనం స్తంభించే వీలుందని హెచ్చరించింది. భారీ వర్షాల కారణంగా ఉత్తరాఖండ్ లో నదులు ఉప్పొంగటం.. కొండచరియలు విరిగిపడటం..ఆకస్మిక వరదలకు దారి తీసిన వైనం తెలిసిందే. ఈ నెలలో కురిసే వర్షాలతో ఆ పరిస్థితులు రిపీట్ కావటంతో పాటు.. దక్షిణ హర్యానా.. ఢిల్లీ.. ఉత్తర రాజస్థాన్ లో సాధారణ జనజీవనం అంతరాయం కలిగే వీలుందని చెబుతున్నారు.

గత రికార్డుల్ని పరిశీలించినప్పుడు 1980 నుంచి ఏటా సెప్టెంబరులో దేశంలో కురిసే వర్షాలు అంతకంతకూ ఎక్కువ అవుతున్న విషయాన్ని ఆయన చెప్పారు. అయితే.. కొన్ని సంవత్సరాల్లో (1986, 1991, 2001, 2004, 2010, 2015, 2019) లో మాత్రం తక్కువ వర్షాలు కురిసిన విషయాన్ని రికార్డులు తెలియజేస్తున్నాయి. ఈ నెలల దక్షిణ భారతంలోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండొచ్చని..కొన్నిసార్లు సాధారణం కంటే తక్కువ స్థాయిలోనూ ఉండొచ్చని చెబుతున్నారు.

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 30 వరకు కురిసిన వర్షాన్ని లెక్కిస్తే.. దీర్ఘకాలిక సగటు కంటే దాదాపు 6 శాతం ఎక్కువన్న విషయాన్ని ఐఎండీ తెలియజేసింది. జూన్ లో సాధారణం కంటే దాదాపు 9 శాతం ఎక్కువ వర్షపాతం నమోదు కాగా.. జులైలో సాధాణరణం కంటే 5 వాతం ఎక్కువగా నమోదైందని పేర్కొంది. ఆగస్టు విషయానికి వస్తే.. సాధారణం కంటే 5.2 శాతం ఎక్కువగా ఉండటం గమనార్హం. మొత్తంగా ఇప్పటివరకు సాగిన వర్షాకాలం మూడు నెలల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కావటం.. ఈ నెల కూడా వర్షాలు అధికంగా ఉండటం చూస్తే..వర్షాల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులకు సంసిద్ధులుగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు. సో.. బీరెడీ.. బీకేర్ ఫుల్.

# సెమీఫైనల్ ముందు వైదొలగిన తిలక్ వర్మ, సాయి కిషోర్.. కారణమిదే!





**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్ కు ముందు సౌత్ జోన్ కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు నుంచి కెప్టెన్ తిలక్ వర్మతో పాటు స్పిన్ ఆల్ రౌండర్ సాయి కిషోర్ టోర్నీలో మిగిలిన మ్యాచ్ లకు దూరమయ్యారు. దీంతో నార్త్ జోన్‌తో జరగబోయే కీలకమైన సెమీ ఫైనల్ కు వీరి సేవలు లేకుండానే సౌత్ జోన్ మ్యాచ్ ఆడనుంది. కెప్టెన్ గా తిలక్ వర్మ జట్టులో కీలక బ్యాటర్ కాగా.. స్పిన్ ఆల్ రౌండర్ సాయి కిషోర్ ఆ జట్టులో మరో కీలక ప్లేయర్. వీరిద్దరూ లేకపోవడంతో జట్టు బలహీనంగా మారనుంది. దులీప్ ట్రోఫీ నుంచి వీరిద్దరూ ఎందుకు వైదొలిగారో ఇప్పుడు చూద్దాం..

**ఆసియా కప్ కు తిలక్ వర్మ:**

తెలుగు క్రికెటర్ తిలంక వర్మ దులీప్ ట్రోఫీలో సౌత్ జోన్ కు కెప్టెన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఆసియా కప్ కు ఎంపిక కావడంతో దులీప్ ట్రోఫీలోని మిగిలిన మ్యాచ్ లకు తిలక్ వర్మ దూరం కావాల్సి వచ్చింది. ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. భారత జట్టు సెప్టెంబర్ 4 లేదా 5 న దుబాయ్ కి వెళ్లాల్సి ఉంది. అదే సమయంలో దులీప్ ట్రోఫి సెమీ ఫైనల్స్ జరగనుంది. ఈ కారణంగా తిలక్ దులీప్ ట్రోఫీకి అందుబాటులో ఉండడం లేదు. తిలక్ స్థానంలో కేరళ వికెట్ కీపర్-బ్యాటర్ మహ్మద్ అజారుద్దీన్ జట్టుకు నాయకత్వం వహిస్తాడు. తమిళనాడు బ్యాటర్ ఎన్ జగదీశన్ వైస్-కెప్టెన్సీ చేయనున్నాడు. తిలక్ స్థానంలో పుదుచ్చేరి ఆల్ రౌండర్ అంకిత్ శర్మను ఎంపిక చేశారు. 2024-25 రంజీ ట్రోఫీ సీజన్‌లో అంకిత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఏడు మ్యాచ్‌ల్లో 24 వికెట్లతో తన జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల లిస్టులో రెండో స్థానంలో నిలిచాడు. బ్యాటింగ్ లోనూ రాణించి 216 పరుగులు చేశాడు.

**సాయి కిషోర్ కు గాయం:**

టోర్నీ ప్రారంభానికి ముందే సాయి కిషోర్ కు గాయమైంది. ఫస్ట్ డివిజన్ క్లబ్ మ్యాచ్‌లో చేతి వేలి గాయం కారణంగా సాయి కిషోర్ ఇంకా కోలుకోలేదు. ఈ క్రమంలో దులీప్ ట్రోఫికి ముందు ప్రారంభమైన బుచ్చిబాబు టోర్నమెంట్‌కు ఈ తమిళనాడు స్పిన్నర్ దూరంగా ఉన్నాడు. సెమీ ఫైనల్ సమయానికి కోలుకుంటాడని భావించినా అతను పూర్తి ఫిట్ నెస్ సాధించలేకపోయాడు. దీంతో దులీప్ ట్రోఫీలోని మిగిలిన మ్యాచ్ లకు దూరమయ్యాడు. సాయి కిషోర్ స్థానంలో ఆంధ్రా బ్యాటర్ షేక్ రషీద్ ను ఎంపిక చేసింది. గత సీజన్ లో రషీద్ 12 ఇన్నింగ్స్‌లలో 627 పరుగులు చేసి రంజీ ట్రోఫీలో ఆంధ్రా జట్టు తరఫున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు.

# ఆసియా కప్‌లో మమ్మల్ని మించిన జట్టు లేదు.. ఓవరాక్షన్ మొదలు పెట్టిన పాకిస్థాన్ పేసర్



**హైదరాబాద్ పెన్ పవర్:** యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న ఆసియా కప్ లో టీమిండియా ఫేవరేట్ గా బరిలోకి దిగుతోంది. రెండేళ్లుగా టీ20 ఫార్మాట్ లో భారత జట్టుకు తిరుగులేకుండా పోతుంది. వెస్టిండీస్ లో జరిగిన వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఒక్క టీ20 సిరీస్ ఓడిపోకుండా వస్తుంది. కోహ్లీ, రోహిత్ శర్మ, జడేజా లాంటి సీనియర్ క్రికెటర్లు రిటైర్మెంట్ ప్రకటించినా ఆ ప్రభావం జట్టుపై పడలేదు. ప్రస్తుతం సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలోని టీమిండియా అద్భుతంగా రాణిస్తోంది. ఆసియా కప్ లో భారత జట్టును ఓడించడం కాదు కదా కనీసం పోటీ ఇచ్చే జట్టే కనిపించడం లేదు. మరోవైపు ఇటీవలే టీ20 క్రికెట్ లో ఘోరంగా ఆడుతున్న పాకిస్థాన్ ఈ టోర్నీలో అంచనాలు లేకుండా బరిలోకి దిగుతోంది. అయితే పాకిస్థాన్ స్టార్ ఫాస్ట్ బౌలర్ హారీస్ రౌఫ్ మాత్రం మరోసారి బీరాలు పలికాడు. త్వరలో జరగబోయే ఆసియా కప్ లో తమ జట్టు కంటే బలమైన జట్టు లేదని చాలా కాన్ఫిడెంట్ గా చెప్పుకొచ్చాడు. పాకిస్థాన్ జట్టుపై రౌఫ్ కు నమ్మకముండొచ్చు. కానీ తమను మించిన ఫేవరేట్స్ లేరని చెప్పుకోవడం అతిగా అనిపిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఆసియా కప్?లో భారత్?తో జరిగే రెండు మ్యాచులు మేమే గెలుస్తామని బీరాలు పలికిన ఈ పాక్ పేసర్.. తాజాగా అన్ని జట్ల కంటే తమ జట్టే ఫేవరేట్ అని చెప్పుకొచ్చాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్?గా మారగా.. హారిస్ రవూఫ్ అతివిశ్వాసంపై నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు. "మీరు గెలిచేది లేదు.. సచ్చేది లేదు.. అన్ని ఉద్దేర మాటలే" అంటూ ఇండియన్ క్రికెట్ ఫ్యాన్స్ రవూఫ్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తున్నారు. పాకిస్థాన్ ఆసియా కప్ జట్టులో హారిస్ రవూఫ్ ఎంపికైన విషయం తెలిసిందే. 2025, సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు దుబాయ్, అబుదాబి వేదికగా ఆసియా కప్-2025 జరగనుంది. ఈ సారి టీ20 ఫార్మాట్?లో జరగనున్న ఈ కాంటినెంటల్ టోర్నీలో పాకిస్తాన్, ఇండియా, ఒమన్, యూఏఈ జట్లు గ్రూప్ ఏలో తలపడనున్నాయి. సెప్టెంబర్ 14న చిరకాల ప్రత్యర్థులు ఇండియా, పాకిస్థాన్ తలపడనున్నాయి. సమీకరణలన్నీ అనుకున్నట్లుగా జరిగితే సూపర్?4 స్టేజ్?లో ఒకసారి, ఫైనల్ పోరులో మరోసారి ఇండియా, పాకిస్థాన్ జట్లు తలపడే అవకాశం ఉంది.

# ద్రవిడ్ తప్పుకోలేదు.. తెలివిగా తొలగించారు.. డివిలియర్స్ హాట్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026కు ముందు రాజస్థాన్ రాయల్స్ జట్టు నుంచి ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తప్పుకున్న సంగతి తెలిసిందే. ద్రవిడ్ తప్పుకోవడానికి సరైన కారణం తెలియాల్సి ఉంది. 2026కి ముందు జట్టుతో కొనసాగరని రాజస్థాన్ ఫ్రాంచైజీ శనివారం (ఆగస్టు 30) ధృవీకరించింది. ఒక్క సీజన్ కే ద్రవిడ్ రాజస్థాన్ రాయల్స్ కు గుడ్ బై చెప్పడం చర్చనీయాంశమైంది. ప్లేయర్ గా, కోచ్ గా ఎంతో అనుభవమున్న ద్రవిడ్ తనంతట తాను వైదొలిగాడా.. లేకపోతే జట్టు యాజమాన్యమే తప్పించిందా అనే విషయంలో క్లారిటీ లేదు. సౌతాఫ్రికా మాజీ కెప్టెన్, మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్.. రాజస్థాన్ జట్టును ద్రవిడ్ వద్దనుకోవడానికి కారణం ఏమై ఉంటుందో తన అభిప్రాయాన్ని షేర్ చేసుకున్నాడు.

డివిలియర్స్ మాట్లాడుతూ రాజస్థాన్ యాజమాన్యం ద్రవిడ్ ను తెలివిగా తప్పించారని.. ఈ క్రమంలో ద్రవిడ్ బాధపడి ఉండొచ్చని తెలిపాడు. "ప్రీమియర్ లీగ్ వంటి ఫుట్‌బాల్ లీగ్‌లను మీరు గమనించినట్లయితే కోచ్‌లు జట్టుకు ఎల్లప్పుడూ టోర్నీలు అందించాలనే ఒత్తిడిలో ఉంటారు. ఒకవేళ వారు అలా చేయకపోతే చేయకపోతే యజమానులు నుండి ఒత్తిడి ప్రారంభమవుతుంది. మనకు వాస్తవాలు తెలియవు. వేరే రోల్ కోసం ద్రవిడ్ కు ఆఫర్ ఇచ్చారని ఫ్రాంచైజీ చెబుతుంది. ఈ పాత్రకు ద్రవిడ్ అంగీకరించలేదంటే అతను ప్రధాన కోచ్ గా ఉండడానికి వారికి ఇష్టం లేదు. అదే సమయంలో వేరే రోల్ లో ఉండడం ద్రవిడ్ కు ఇష్టం లేదు. దీంతో ప్లాన్ చేసి ద్రవిడ్ ను తప్పించునట్టు నాకు అర్థమవుతోంది". అని డివిలియర్స్ తన అభిప్రాయాన్ని తెలిపాడు. సెప్టెంబర్ 6, 2024న ద్రవిడ్ తో రాజస్థాన్ రాయల్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్క సీజన్ కే ద్రవిడ్ రాజస్థాన్ రాయల్స్ కు గుడ్ బై చెప్పాడు. గత సీజన్ (ఐపీఎల్ 2025) రాజస్థాన్ రాయల్స్ జట్టు 14 మ్యాచ్ ల్లో కేవలం నాలుగు మ్యాచ్ ల్లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో 9 వ స్థానంలో నిలిచింది. ఇప్పటికే కెప్టెన్ సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్ జట్టుతో విడిపోతున్నాడంటూ వార్తలు వస్తున్న సమయంలో ద్రవిడ్ రాజీనామా చేయడం ఆ జట్టులో గందరగోళంగా మారింది.

ద్రవిడ్ కు రాజస్థాన్ రాయల్స్ కు మధ్య చక్కని అనుబంధం ఉన్న సంగతి తెలిసిందే. రాజస్థాన్ రాయల్స్ తరపున కెప్టెన్ గా ఆడిన ఈ మాజీ భారత ప్లేయర్.. 2013లో ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ కు జట్టును ఫైనల్ కు చేర్చాడు. 2012, 2013లో సీజన్‌లలో రాయల్స్ కెప్టెన్ గా ఉన్నాడు. 2014, 2015లో రాజస్థాన్ జట్టు మెంటార్ గా ఉన్నాడు.

# కాటుక కళ్ళతో కవ్విస్తున్న శ్రీలీల!

కొన్ని కొన్ని సార్లు హీరోయిన్లను చూస్తూ ఉంటే స్వర్గంలో ఉండే దేవకన్యలు ఇలాగే ఉంటారా అనిపిస్తుంది. ఎందుకంటే అంత అందంగా తయారవుతారు.. అచ్చం ఇప్పుడు శ్రీలీలను చూస్తే కూడా అలాంటి ఫీలింగే వస్తోంది. నల్లటి చీరలో శ్రీలీల ఆ బాపు బొమ్మే దిగి వచ్చినట్టు కనిపిస్తోంది. ఆ నల్లటి చీరలో.. కాటుక కళ్ళతో చూపరులను కవ్విస్తోంది. విరబూసిన జుట్టుతో మరోసారి అందరి దృష్టిని ఆకట్టుకుంది. చాలామంది హీరోయిన్లు సినిమాల్లో అవకాశాల కోసం సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ని పెంచుకోవడం కోసం తమ ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా హాట్ హాట్ ఫొటోస్ ని షేర్ చేస్తూ ఉంటారు. అలా తాజాగా శ్రీలీల పోస్ట్ చేసిన ఫోటోలు మాత్రం కుర్రకారుకి పిచ్చెక్కిస్తున్నాయి.. నల్లటి చీరలో తెల్లటి చందమామలా మెరిసిపోతున్న శ్రీలీల ఫోటోలు చూసి చాలామంది నెటిజన్లలో కవిత్వం పొంగిపోతుంది. శ్రీలీల ఫోటోలకి ఒక్కొక్కరు ఒక్కోరకంగా కామెంట్లు పెడుతున్నారు.. నల్లటి ఆకాశంలో తెల్లటి చందమామ లాగా నల్లటి చీర కట్టుకున్న చందమామ లాంటి శ్రీ లీల ఎంత అందంగా ఉందో అంటూ కవితల లాంటి కామెంట్లతో శ్రీలీల అందాన్ని తెగ పొగిడేస్తున్నారు.. అలా శ్రీలీల ఈ మధ్యకాలంలో చీరలో ఉన్న ఫొటోస్ ని ఎక్కువ షేర్ చేస్తోంది. రీసెంట్ గానే పెళ్లి చూపులకు రెడీ అయ్యే పెళ్లికూతురు లాగా చీర కట్టుకొని ముద్దుగా ముస్తాబయ్యి ఫొటోస్ షేర్ చేసింది. తాజాగా నల్లటి చీరలో చందమామ లాగా మెరిసిపోతున్న శ్రీలీలను చూసి ఆ అందమే అసూయ పడేలా ఉంది అంటూ ఆమె అభిమానులు తెగ మురిసిపోతున్నారు.. ఇక శ్రీలీల సినిమాల విషయానికి వస్తే.. టాలీవుడ్లోకి పెళ్లి సంద%ఆ% మూవీతో వచ్చింది. అయితే సినిమా ఓ మోస్తారు హిట్ అయినప్పటికీ అందులో నటించిన శ్రీ లీల యాక్టింగ్ మాత్రం అందరి హృదయాల్లో పాతుకు పోయింది. అలా ధమాకా సినిమా నుండి తన హవా కొనసాగిస్తోంది . ఇప్పటివరకు శ్రీలీల నటించిన సినిమాల్లో హిట్స్ తక్కువ.. ఫ్లాప్స్ ఎక్కువగా ఉన్నప్పటికీ ఈ ముద్దుగుమ్మకి వరుస ఆఫర్స్ వస్తున్నాయంటే ఆమె క్రేజ్ ఎలాంటిదో చెప్పుకోనక్కర్లేదు. శ్రీలీల చేతిలో ప్రస్తుతం హిందీ సినిమాలతో పాటు తెలుగు, తమిళ సినిమాలు కూడా ఉన్నాయి. అలా శ్రీలీల రవితేజతో కలిసిన నటించిన 'మాస్ జాతర' మూవీ షూటింగ్ పూర్తయి విడుదలకు సిద్ధంగా ఉంది. ఆగస్టులోనే విడుదలవ్వాల్సిన ఈ సినిమా అక్టోబర్ 31కి వాయిదా పడింది. అంతేకాకుండా పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటిస్తోంది. అలాగే బాలీవుడ్ లో కార్తిక్ ఆర్యన్ తో కలిసి మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా జానర్ లో ఓ సినిమా చేస్తోంది. బాలీవుడ్ లో ఇబ్రహీం అలీఖాన్ తో కూడా ఓ సినిమా చేస్తున్నట్టు రూమర్స్ వినిపిస్తున్నాయి. తమిళంలో సుధా కొంగర డైరెక్షన్లో శివ కార్తికేయన్ నటించబోయే పరాశక్తి మూవీలో కూడా శ్రీలీల హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. అలా చేతినిండా సినిమాలతో బిజీ బిజీగా గడుపుతూనే టైం దొరికినప్పుడల్లా ఇలా ఫోటోలకు ఫోజులిస్తూ కుర్రకారు మది దోచుకుంటోంది.





## రుహానీ శర్మ: గులాబీ రంగులో వికసించే సొగసు



## పాయల్ రాజ్‌పుత్ షేర్ చేసే ప్రతి ఫ్రేమ్‌లో చాలా అందంగా కనిపిస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com